

275 మంది వీఆర్‌వోలు బదిలీ

అనకాపల్లి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 275 మంది గ్రామ రెవెన్యూ అధికారులను (వీఆర్వోలు) బదిలీ చేస్తూ కలెక్టర్ విజయకృష్ణన్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. సాధారణ బదిలీల్లో భాగంగా దరఖాస్తు చేసుకున్న 236 మంది గ్రేడ్-1 వీఆర్‌వోలను, అదేవిధంగా 39 మంది గ్రేడ్-2 వీఆర్‌వోలకు స్థానచలం కల్పించారు. కాగా వీఆర్‌వోల బదిలీల్లోనూ స్థానిక ప్రజాప్రతినిధుల సిఫారసులకే ప్రాధాన్యం ఇచ్చారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

దుర్వాసన భరించాల్సిందేనా!?

జీవీఎంసీ జోనల్ కార్యాలయ ఆవరణలో ట్రాన్సిట్ డంపింగ్ యార్డు

- కుళ్లిపోయి కంపుకొడుతున్న చెత్తాచెదారం
- ఇబ్బంది పడుతున్న స్థానికులు, పాఠశాల విద్యార్థులు
- సమస్యను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లిన స్థానిక నేతలు
- పట్టణానికి దూరంగా తరలించాలని కలెక్టర్ల సదస్సులో సీఎం సూచన
- సత్వరమే చర్యలు తీసుకోవాలని జీవీఎంసీ జడ్సీకి కలెక్టర్ ఆదేశం
- నెల రోజులు దాటినా యార్డును తరలించని అధికారులు



జీవీఎంసీ జోనల్ కార్యాలయ ఆవరణలో చెత్త కుప్ప

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 30:

పట్టణం మధ్యలో వున్న జీవీఎంసీ జోనల్ కార్యాలయం ఆవరణలో చాలా కాలంగా నిర్వహిస్తున్న ట్రాన్సిట్ కంపోస్టుయార్డును వేరే ప్రదేశానికి తరలించడంలో అధికారులు తీవ్రంగా జాప్యం చేస్తున్నారు. సీఎం చంద్రబాబునాయుడు ఇటీవల ఎస్.రాయవరం మండలంలో పోలవరం ఎడమ కాలువ పరిశీలనకు వచ్చినప్పుడు అనకాపల్లి చెందిన పలువురు నాయకులు ఆయనను కలిసి జీవీఎంసీ జోనల్ కార్యాలయం ఆవరణలో ఉన్న కంపోస్టుయార్డు సమస్యను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. తరువాత అమరావతిలో ఆగస్టు నెలలో జరిగిన జిల్లా కలెక్టర్ల సమావేశంలో ఈ విషయాన్ని ముఖ్యమంత్రి ప్రస్తావించి తక్షణమే కంపోస్టుయార్డును పట్టణానికి దూరంగా తరలించి ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్‌కు సూచించారు. దీంతో కలెక్టర్ విజయకృష్ణన్.. కంపోస్టుయార్డును జీవీఎంసీ జోనల్ కార్యాలయం నుంచి తరలించేందుకు సత్వరమే చర్యలు తీసుకోవాలని జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడును ఆదేశించారు. ఇది జరిగి నెల రోజులు దాటినప్పటికీ కంపోస్టుయార్డును తరలించలేదు.

యార్డు నుంచి దుర్గంధం.. స్థానికుల ఇక్కట్లు

జీవీఎంసీ జోనల్ కార్యాలయం ఆవరణలోని కంపోస్టుయార్డుకు ఆనుకుని నివాస గృహాలు, ఉన్నత పాఠశాల వున్నాయి. ఇక్కడ చెత్తాచెదారం నుంచి దుర్వాసన వస్తుండడంతో స్థానికులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం కురిసిన సమయంలో తీవ్ర దుర్వాసన వస్తున్నదని వాపోతున్నారు. ఇంకా జోనల్ కార్యాలయంలో ఉద్యోగులు కూడా ముక్కులు మూసుకుని పనిచేయాల్సి వస్తున్నది.

పుష్కరకాలంగా..

కంపోస్టుయార్డు 2013 వరకు పట్టణానికి ఆనుకుని ఉన్న శారదానగర్ సమీపంలోని మునిసిపాలిటీ స్థలంలో ఉండేది. శారదానగర్‌లో నివాసాలు పెరగడంతో స్థానికులు కంపోస్టు యార్డు సమస్యను అప్పట్లో మంత్రిగా ఉన్న గంటా శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఆయన డంపింగ్ యార్డును వేరేచోటుకు తరలించాలని అధికారులను ఆదేశించారు. వేటజంగాలపాలెం ప్రాంతంలో క్వారీ ప్రదేశాలను పరిశీలించగా స్థానికులు తీవ్రంగా వ్యతిరేకించారు. తర్వాత కొంతకాలం కొప్పాక సమీపంలోని రైల్వే వంతెన పక్కన ఖాళీ స్థలంలో చెత్తను డంపింగ్ వేశారు. ఇక్కడ పొలాలు వున్న రైతుల నుంచి వ్యతిరేకత రావడంతో విశాఖ కాలుప్పాడలోని డంపింగ్ యార్డుకు తరలించాలని నిర్ణయించారు. తొలుత పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో సేకరించిన చెత్తను జీవీఎంసీ ... మిగతా 8వ పేజీలో

ఉత్సవ విగ్రహాలుగా ఎంపీటీసీలు

వైసీపీ హయాంలో స్థానిక సంస్థలు నిర్వీర్యం

- ‘ప్రాదేశిక సభ్యులకు’ నిధులు లేవు.. గౌరవమూ లేదు!
- గత ఏడాది ఫిబ్రవరి నుంచి అందని గౌరవ వేతనాలు
- ఒక్కో సభ్యునికి రూ.60 వేల బకాయి
- కూటమి ప్రభుత్వంపైనే ఆశలు



మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి హాజరైన సభ్యులు (ఫైల్ ఫొటో)

చోడవరం, సెప్టెంబరు 30:

అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేసినట్టుగానే.. గత వైసీపీ ప్రభుత్వం స్థానిక సంస్థలను భ్రష్టుపట్టించింది. కేంద్ర ఇచ్చిన ఆర్థిక సంఘం నిధులను రాష్ట్ర ఖజానాకు మళ్లించుకుని పంచాయతీలను కుదేలును చేసింది. ఇక ప్రజలు ఎన్నుకున్న స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులను డమ్మీలుగా మార్చేసింది. ఇప్పటికే నిధులు, అధికారాలు లేని మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాల (ఎంపీటీసీ) సభ్యులకు కనీసం గౌరవ వేతనం కూడా చెల్లించలేదు. వైసీపీ అధికారంలో నుంచి దిగిపోయేనాటికి వీరికి 19 నెలల గౌరవ వేతనాలు బకాయిలు వున్నాయి.

ప్రస్తుత మండల పరిషత్తు పాలకవర్గాలు ఏర్పడి మూడేళ్లు నిండాయి. ఇందులో సర్పంచులతోపాటు ఎంపీటీసీ సభ్యులు కూడా ప్రధాన భూమిక పోషిస్తుంటారు. గ్రామ పంచాయతీల్లో సాధారణ నిధులతోపాటు కేంద్ర ఇచ్చే ఆర్థిక సంఘం నిధులు కూడా వుంటాయి కాబట్టి సర్పంచులకు గౌరవ వేతనాల విషయంలో పెద్దగా ఇబ్బంది వుండదు. కానీ ఎంపీటీసీ సభ్యులకు ప్రత్యేకంగా ఎటువంటి అధికారాలు, నిధులు వుండవు. అభివృద్ధి పనులకు జడ్పీ కేటాయించే అరకొర నిధులు తప్ప ఆర్థికంగా ఎటువంటి వెసులుబాటు వుండదు. దీంతో ప్రభుత్వం ఇచ్చే గౌరవ వేతనం ఒకింత వెసులుబాటుగా వుంటుంది.

వాస్తవానికి రాష్ట్ర విభజన ముందు వరకు మైనర్ పంచాయతీ సర్పంచుకు రూ.600, మేజర్ పంచాయతీ సర్పంచుకు రూ.1,000, ఎంపీటీసీ సభ్యునికి రూ.750, ఎంపీపీకి రూ.1500, జడ్పీటీసీ సభ్యునికి రూ.1,500 గౌరవ వేతనం వుండేది. 2015లో అప్పటి టీడీపీ ప్రభుత్వం స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల గౌరవ వేతాలను భారీగా పెంచింది. మేజర్, మైనర్ పంచాయతీలు అన్న తేడా లేకుండా సర్పంచులందరికీ నెలకు రూ.3 వేలు, ఎంపీటీసీ సభ్యునికి రూ.3 వేలు, ఎంపీపీకి రూ.6 వేలు, జడ్పీటీసీ సభ్యునికి రూ.6 వేల చొప్పున గౌరవ వేతనం పెంచింది. టీడీపీ హయాంలో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు గౌరవ వేతాల కోసం మూడు నెలలకోసారి నిధులు విడుదల అయ్యేవి. కానీ వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఈ విధానానికి స్వస్తి పలికింది. 2021 సెప్టెంబరులో మండల పరిషత్ పాలకవర్గాలు ఏర్పడగా, ప్రభుత్వప రంగా మండల పరిషత్‌లకు పెద్దగా నిధు లు విడుదల కాలేదు. కేంద్రం నుంచి వచ్చే నిధులన్నీ నేరుగా పంచాయతీలకు వెళుతుండడం, మండల పరిషత్‌లకు నిధులు లేకపోవడంతో ఎంపీటీసీ సభ్యులు ఉత్సవ విగ్రహాలుగా మిగిలి పోయారు. తన ప్రాదేశిక నియోజక వర్గంలో అభివృద్ధి పనులు చేసేందుకు ఒక్క రూపాయి కూడా అందుబాటులో లేకపోవడంతో ఎంపీటీసీ సభ్యులకు గుర్తింపు లేకుండాపోయింది.

20 నెలలుగా అందని గౌరవ వేతనాలు

వైసీపీ అధికారంలోనికి వచ్చిన తరువాత ఏడాది వరకు గౌరవ వేతనాలకు నిధులు విడుదల అయ్యాయి. ఆ తరువాత నుంచి నిధులు ఇవ్వడంలేదు. ఎంపీటీసీ సభ్యులకు 2023 జనవరి వరకే గౌరవ వేతనాలు అందాయి. గత ఏడాది ఫిబ్రవరి నుంచి ఈ ఏడాది సెప్టెంబరు వరకు 20 నెలలకుగాను ఒక్కో సభ్యునికి రూ.60 వేల చొప్పున అందాల్సి వుంది. ఎంపీటీసీ సభ్యులుగా గెలుపొంది మూడేళ్లు నిండాయి. ఇందులో మూడింట ఒక వంతు కాలానికి మాత్రమే గౌరవ వేతనాలు అందాయి. నిధులు, గౌరవం ఎటూ లేవు.. కనీసం గౌరవ వేతనాలు కూడా నెలల తరబడి ఇవ్వకపోవడం దారుణమని ఎంపీటీసీ సభ్యులు వాపోతున్నారు. వైసీపీ పాలనలో స్థానిక సంస్థలకు కనీస ప్రాధాన్యం లేకపోవడం, గౌరవ వేతనాలు చెల్లించకపోవడం ... మిగతా 8వ పేజీలో

కౌన్సిల్ సమావేశంలో ఇసుక దుమారం

టీడీపీ, వైసీపీ సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం



టీడీపీ కౌన్సిలర్ రాజేశ్, వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణల మధ్య వాగ్వాదం

- పారిశుధ్య పనులకు సాధారణ నిధుల వ్యయంపై గొడవ
- మెయిన్ రోడ్డులో ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగించాలని ఇరుపక్షాల సభ్యులు డిమాండ్

నర్సీపట్నం, సెప్టెంబరు 30: ఇసుక కొరత, పారిశుధ్య పనులకు నిధుల వినియోగంపై మునిసిపల్ కౌన్సిల్ సమావేశంలో టీడీపీ, వైసీపీ కౌన్సిలర్ల మధ్య తీవ్ర వాదోపవాదాలు, ఆరోపణలతో ఉద్రిక్తంగా సాగింది. ఒకానొక దశలో బిగ్గరగా కేకలు వేసుకున్నారు. దీంతో ఎవరు, ఏం మాట్లాడుతున్నారో అర్థంకాని పరిస్థితి నెలకొంది.

మునిసిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి అధ్యక్షతన సోమవారం సాధారణ సమావేశం జరిగింది. వైసీపీకి చెందిన వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ మాట్లాడుతూ, ఇసుక దొరక్క ఇళ్ల నిర్మాణాలు ఆగిపోయాయని, ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, మరోవైపు భవన నిర్మాణ కార్మికులకు పనులు లేకుండా పోయాయని అన్నారు. టీడీపీ కౌన్సిలర్ దనిమిరెడ్డి మధుబాబు మాట్లాడుతూ, గబ్బాడలో గత ప్రభుత్వం నిర్వహించిన ఇసుక డిపోలో జరిగిన అవకతవకలపై స్పీకర్ అయ్యన్నపాత్రుడు విచారణ చేయిస్తున్నారని అన్నారు. వైస్ చైర్మన్ తమరాన అప్పలనాయుడు ప్రతిస్పందిస్తూ.. విచారణ చేసుకుంటే తమకు అభ్యంతరం లేదు, అక్కడ ఎంత ఇసుక ఉందో లెక్కలు తేల్చి, త్వరగా భవన నిర్మాణదారులకు అందుబాటులోకి తీసుకు రావాలని అన్నారు. ఈ సందర్భంగా టీడీపీ కౌన్సిలర్ చింతకాయల రాజేశ్, వైసీపీ వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణల మధ్య వాగ్వాదం జరిగింది. స్పీకర్ పర్యటన నుంచి వచ్చిన వెంటనే గబ్బాడ ఇసుకపై నిర్ణయం తీసుకుంటారని రాజేశ్ అన్నారు.

అంతకు ముందు వైస్ చైర్‌పర్సన్ కోనేటి రామకృష్ణ మాట్లాడుతూ, పారిశుధ్య పనులకు రూ.1.7 కోట్లు సాధారణ నిధుల నుంచి కేటాయించారని, ఆ నిధులను ప్రజల అవసరాలకు ఉంచి, రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధుల మంజూరుకు కృషి చేయాలని అన్నారు. దీంతో టీడీపీ కౌన్సిలర్లు డబ్బీరు శ్రీకాంత్, దనిమిరెడ్డి మధుబాబు అభ్యంతరం వ్యక్తం చేశారు. వార్డుల్లో పారిశుధ్యం అధ్వానంగా ఉందని, ఈ విషయాన్ని ఎన్నోసార్లు కౌన్సిల్‌లో సమావేశంలో ప్రస్తావించామని, అయినా పాలకవర్గం పట్టించుకోలేదని ఆరోపించారు. పారిశుధ్యం కోసం ఇప్పుడు రూ.1.7 కోట్లు ఖర్చు చేస్తున్న మునిసిపల్ కమిషనర్‌ను అభినందిస్తున్నామని అన్నారు. ఈ సందర్భంగా ఇరువురి కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. వైస్ చైర్మన్ తమరాన అప్పలనాయుడు మాట్లాడుతూ, పెదబొడ్డేపల్లిలో నిరుపయోగంగా వున్న మరుగుదొడ్ల మరమ్మతులకు రూ.7 లక్షలు కేటాయించడం ఎందుకని ప్రశ్నించారు. ఆ నిధులతో సచివాలయ భవనాన్ని మరమ్మతులు చేయించాలని సూచించారు. మునిసిపల్ కమిషనర్ సురేంద్ర మాట్లాడుతూ, బహిరంగ మల విసర్జన ... మిగతా 8వ పేజీలో

చెరువు ఆక్రమణ

తుమ్మపాలలో రెచ్చిపోతున్న కబ్జాదారులు

- కొత్త చెరువు గట్టుతోసహా గర్భం ఆక్రమణ
- సెంటు రూ.3 లక్షలకు దర్జాగా విక్రయం
- తొలుత పాకలు ఏర్పాటు.. తరువాత పక్కా ఇళ్ల నిర్మాణం
- పట్టించుకోని ఇరిగేషన్, పంచాయతీ అధికారులు



చెరువు గట్టును చదునుచేసి నిర్మించిన రేకుల షెడ్డు (ఇన్‌సెట్) చెరువు స్థలంలో నిర్మించిన దుకాణాలు

తుమ్మపాల (అనకాపల్లి), సెప్టెంబరు 30:

అనకాపల్లి మండలం తుమ్మపాలలో జలవనరుల శాఖకు చెందిన సాగునీటి చెరువు ఆక్రమణలకు గురవుతున్నది. కబ్జాదారులు చెరువు కట్టను ధ్వంసం చేసి దర్జాగా ఆక్రమిస్తున్నారు. తొలుత చిన్నపాటి పాకలు వేసి, కొంతకాలం తరువాత రేకుల షెడ్లు, పిమ్మట పక్కా భవనాలు నిర్మిస్తున్నారు. మరికొంతమంది సెంటు రూ.3 లక్షల చొప్పున అనధికారికంగా విక్రయాలు జరుపుతున్నారు.

అనకాపల్లి కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పడిన తరువాత పట్టణంతోపాటు చుట్టుపక్కల గ్రామాల్లో భూముల విలువ గణనీయంగా పెరిగింది. దీంతో అక్రమార్కుల కన్ను ప్రభుత్వ స్థలాలు, కొండవాలు ప్రదేశాలు, బంజరు భూములు, చెరువులపై పడింది. మేజరు పంచాయతీ తుమ్మపాలలో మెయిన్ రోడ్డును ఆనుకుని సర్వే నంబరు 266లో ఆరు ఎకరాల 63 సెంట్లల్లో కొత్తచెరువు విస్తరించి ఉంది. దీనికింద సుమారు 50 ఎకరాల ఆయకట్టు వుంది. ప్రధాన రహదారిని ఆనుకుని వుండడంతో ఇక్కడ సెంటు రూ.5-7 లక్షలు పలుకుతున్నది. దీంతో కొంతమంది స్థానికులు కొత్తచెరువును ఆక్రమించడం మొదలుపెట్టారు. చెరువు గట్టును ధ్వంసం చేసి కబ్జా చేస్తున్నారు. తొలుత పశువుల పాకలు వేసి, కొంతకాలం తరువాత పక్కా నిర్మాణాలు చేపడుతున్నారు. మెయిన్‌రోడ్డు వైపున కొంతమంది భవనాలను నిర్మించి వాణిజ్య అవసరాలకు అద్దెకు ఇస్తున్నారు. కొత్తచెరువులో సుమారు 1.5 ఎకరాల భూమి కబ్జాకు గురైందని ఆయకట్టు రైతులు చెబుతున్నారు. ఇక్కడ సెంటు రూ.5 లక్షల చొప్పున అనధికారికంగా విక్రయాలు జరుపుతున్నారు. కబ్జాదారులు తమ అక్రమ సంపాదనలో కొంతమొత్తాన్ని అధికారులకు, కిందిస్థాయి సిబ్బందికి ఇస్తుండడంతో చెరువు ఆక్రమణల ... మిగతా 8వ పేజీలో

దసరాకు ప్రత్యేక బస్సులు

- మెరుగ్గా ఆర్టీసీ పార్శిల్ ఆదాయం



ఆర్టీసీ డిపోను పరిశీలిస్తున్న జోన్ ఇన్‌చార్జి ఈడీ అప్పలనాయుడు

- జోన్ ఇన్‌చార్జి ఈడీ అప్పలనాయుడు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 30: దసరా శరన్నవరాత్రి వేడుకల సందర్భంగా పీటీడీ విజయనగరం జోన్‌లోని 19 డిపోల నుంచి 300 వరకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్టు జోన్ ఇన్‌చార్జి ఈడీ అప్పలనాయుడు చెప్పారు. సోమవారం ఆయన అనకాపల్లి డిపోను సందర్శించారు. కార్గో సర్వీసులను పరిశీలించి కలాసీలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హైదరాబాద్, విజయవాడ, రాజమహేంద్రవరం, కాకినాడ, శ్రీకాకుళం, విజయనగరం ప్రాంతాలకు దసరా ప్రత్యేక సర్వీసులు నడపనున్నామన్నారు. జోన్ పరిధిలో పార్శిల్ ఆదాయం బాగుందన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు రూ.12 కోట్లు ఆదాయం లభించిందని, మార్చి చివరినాటికి రూ.24 కోట్లు ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పార్శిల్ రవాణాలో రాష్ట్రంలో విజయనగరం జోన్ ముందంజలో ఉందని వివరించారు. బైపాస్ మీదుగా వెళుతున్న వివిధ ప్రాంతాల ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసులను ... మిగతా 8వ పేజీలో

నేడు ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

- జిల్లాలో 2,60,816 మంది లబ్ధిదారులు
- రూ.107.72 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం
- ఉదయం 6 గంటల నుంచే పంపిణీ

అనకాపల్లి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): అక్టోబరుకు సంబంధించి ఎన్టీఆర్ భరోసా పింఛన్ డబ్బుల పంపిణీకి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఒకటో తేదీ మంగళవారంనాడు సచివాలయాల ఉద్యోగులు, ఆయా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి నగదు అందించనున్నారు. ఉదయం ఆరు గంటల నుంచే పింఛన్ నగదు పంపిణీ చేసేందుకు జిల్లా అధికారులు ఏర్పాట్లు చేశారు. జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛన్‌దారులు 2,60,816 మంది వుండగా, వీరికి పంపిణీ చేయడానికి రూ.107.72 కోట్లు విడుదలయ్యాయని, వీటిని ఆయా సచివాలయాల సిబ్బందికి బ్యాంకుల ద్వారా అందజేసినట్టు డీఆర్‌డీఏ పీడీ శశీదేవి తెలిపారు. పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొంటారని ఆమె చెప్పారు.



మునిసిపల్ ఉపాధ్యాయుల సమస్యలపై సత్యాగ్రహ దీక్ష రేపు



డీఈవో కార్యాలయ అధికారికి నోటీసు ఇస్తున్న యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చినబ్బాయి

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 30: మునిసిపల్ ఉపాధ్యాయుల సమస్యలపై అక్టోబరు రెండో తేదీన నెహ్రూచౌక్ వద్ద సత్యాగ్రహ దీక్ష చేపడుతున్నట్టు యూటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి గొంది చినబ్బాయి పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం డీఈవో కార్యాలయంలో ఏడీ రమాజ్యోతికి నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మునిసిపల్ ఉపాధ్యాయుల సర్వీసులు విద్యాశాఖ పరిధిలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నప్పటికీ ప్రధాన సమస్యలు ఇప్పటికీ పరిష్కారం కాలేదన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వి.శ్రీలక్ష్మి, మునిసిపల్ ఉపాధ్యాయుల సంఘం నాయకులు మాకిరెడ్డి రాజునాయుడు, బాషా, నాతవరపు సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాప్యంలో ఒంటరవుతున్న తల్లిదండ్రులు

వయసు భారం... ప్రేమకు దూరం!

మారుతున్న పిల్లల వ్యవహారశైలితోనే సమస్య

- మలిదశలో కోరుకునేది ప్రేమ, ఆప్యాయత
- వృత్తి, వ్యాపార రీత్యా దూరమవుతున్న పిల్లలు
- స్వార్థంతో పక్కన పెడుతున్న మరికొందరు

నేడు అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం



విశాఖపట్నం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పిల్లలే జీవితంగా... వారి ఆలనా పాలనా... చదువు... పెళ్లి... ఇలా జీవితాలను త్యాగం చేసిన ఎంతోమంది తల్లిదండ్రులు మలి వయసులో కనీస ప్రేమకు దూరమవుతున్నారు. పలుకరించే దిక్కులేక... పట్టించుకునే పిల్లలు లేక వృద్ధాశ్రమాల్లో చరమాంకాన్ని భారంగా గడుపుతున్నారు. చిన్నప్పుడు గుండెలపై పెట్టుకుని పెంచిన పిల్లలే తీరని శోకాన్ని మిగులుస్తుండడంతో ఎంతోమంది తల్లిదండ్రులు మౌనంగా రోదిస్తున్నారు. వృద్ధాప్యంలో అండగా ఉండాల్సిన వారు అందనంత దూరానికి వెళ్లిపోవడంతో మనో వేదనకు గురవుతున్నారు. ఇది ప్రస్తుతం సామాజిక సమస్యగా మారిపోయింది. నేడు అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..

వృద్ధాప్యం.. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఎదుర్కోవాల్సిన దశ. ఈ దశలో తల్లిదండ్రులను ఎలా చూసుకుంటే.. భవిష్యత్తులో తమ పిల్లలు కూడా అలానే చూసుకుంటారన్న విషయాన్ని చాలామంది మర్చిపోతున్నారు. వృద్ధాప్యంలో తల్లిదండ్రుల పట్ల పిల్లలు తప్పనిసరిగా ఆదరణ, ప్రేమతో నడుచుకోవాలనే అంశాన్ని తెలియజేసే ఉద్దేశంతో ఏటా అక్టోబరు ఒకటో తేదీన ప్రపంచ వృద్ధుల దినోత్సవంగా నిర్వహిస్తున్నారు. వృద్ధులు ఎదుర్కొనే ఇబ్బందులు, ఆ సమయంలో పిల్లల బాధ్యతను తెలియజేసేందుకు ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.



తోడుంటే బాగుండనిపిస్తుంటుంది



వృద్ధాప్యంలో తోడుంటే బాగుండు అనిపిస్తుంది. ఎన్ని ఇబ్బందులున్నా కుటుంబంతో ఉంటే ఆ సంతృప్తి వేరు. తిండి, నిద్రతోపాటు మానసిక ఆనందాన్నిచ్చే మాటలు కావాలి. వృద్ధాప్యం ప్రతి ఒక్కరి జీవితంలోనూ మిగిలిపోయే దుర దృష్టకరమైన దశగా మారింది.

- దుక్క రామారావు, వృద్ధుడు

ఒంటరితనం.. వేదనా భరితం

వృద్ధాప్యం దరి చేరడంతోనే అనేక అవసరాలుంటాయి. అప్పటివరకు శారీరక సామర్థ్యంపై ఆధారపడి జీవించిన వారంతా ఎవరో ఒకరిపై ఆధారపడాల్సిన పరిస్థితి ఎదురవుతుంది. ఈ వయసులో పిల్లలు తల్లిదండ్రులకు అండగా, బాసటగా నిలవాలి. వృద్ధాప్యం మరో పసితనం లాంటిది. చిన్న పలకరింపు, ఆప్యాయతతో కూడిన మాటలు వారి మనసు కోరుకుంటుంది. అలాంటి వాతావరణాన్ని కల్పించాల్సిన బాధ్యత పిల్లలదే. అమ్మా, నాన్న అని ఆప్యాయంగా పిలిచేవారు లేక ఎంతోమంది ఒంటరితనంతో మానసిక వేదనకు గురవుతున్నట్టు అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి.

ఆ రోజు తప్పనిసరి..

ఉద్యోగ, వ్యాపార రీత్యా పిల్లలు తల్లిదండ్రులకు దూరంగా ఉండాల్సిన పరిస్థితిలో ఒంటరితనాన్ని అనుభవిస్తున్న వృద్ధులు కొందరు. పిల్లలకు అన్నీ ఇచ్చినా వారిని సాకేందుకు ఇష్టపడని పిల్లలున్నవారు మరికొందరు. తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులతో కాలం గడపలేని పరిస్థితులను ఎదుర్కొంటు న్న వారు ఇంకొందరు. ఇంకా కొంతమంది కుటుంబసభ్యులు ఎవరూలేక నరకయాతన అనుభవిస్తున్న వారు. ఇలాంటి వారికి అండగా అనేక స్వచ్ఛంద సంస్థలున్నాయి. కొంతమందికి వృద్ధాశ్రమాల్లో ఆశ్రయాన్ని కల్పిస్తుండగా, కొన్నిచోట్ల 60 ఏళ్లు దాటిన వారంతా గ్రూపుగా ఏర్పడి తమ అవసరాలను తామే తీర్చుకునేవిధంగా ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

ఒంటరిగా మిగిలాను



పదేళ్ల కిందట భర్త చనిపోయాడు. ఆ తరువాత వృద్ధాశ్రమే దిక్కయింది. జీవితంలో ఎన్నో చూశాను. నా అన్న వారు లేకపోవడం బాధాకరం. ఈ దశలో కుటుంబ సభ్యులు పక్కన ఉంటే ఆ హాయే వేరు. ఆ అవకాశాన్ని దేవుడు ఇవ్వలేదు. తోడుగా ఉండాల్సిన మనిషి ముందే వెళ్లిపోయాడు. కుటుంబం కంటే గొప్ప మనసున్న వారితో కలిసి జీవించే అవకాశం దక్కింది.

- కె.అన్నపూర్ణ, వృద్ధురాలు

కుటుంబం తోడుంటే సంతృప్తి



వృద్ధాప్యంలో కుటుంబంతో కలిసి ఉంటే ఆ ఆనందం వేరుగా ఉంటుంది. చివరి దశలో పిల్లలు తల్లిదండ్రులకు అండగా ఉండాలి. అదే వారిచ్చే పెద్ద గిఫ్ట్. వ్యాపారాలు చేశాను. దుకాణాల్లో పనిచేశాను. ప్రస్తుతం ఆరోగ్యం సహకరించడం లేదు. చివరిదశ వృద్ధాశ్రమంలో గడుస్తోంది. ఇప్పుడు తల్లిదండ్రులను ఎంత బాగా చూసుకుంటే.. భవిష్యత్తులో వారి పిల్లలు వారిని అలాగే చూసుకుంటారు. ఈ విషయాన్ని నేటి తరం గుర్తించాలి.

- ఎం.నాగరాజు, వృద్ధుడు

శారీరక ఆరోగ్యానికి దోహదం

సాత్విక జీవనానికి శాకాహారం

- మాంసాహారంతో పోలిస్తే పోషకాలు ఎక్కువ
- జీర్ణవ్యవస్థ మెరుగ్గా పనిచేసే అవకాశం
- నేడు ప్రపంచ శాకాహార దినోత్సవం



విశాఖపట్నం, సెప్టెంబరు 30: మితాహారం, శరీరానికి మేలు చేసేది శాకాహారం మాత్రమే. మాంసాహారంలో లభించే పోషకాల కన్నా, శాకాహారంలో ఎక్కువని నిపుణులు చెబుతున్నారు. అంతేకాదు శాకాహారులు ఆరోగ్య రీత్యా మరింత మెరుగ్గా ఉంటారని కూడా సూచిస్తున్నారు. అమెరికాలోని లిండా యూనివర్సిటీ అధ్యయనం ప్రకారం మాంసాహారుల కంటే శాకాహారులు కనీసం ఆరేళ్లు ఎక్కువ కాలం బతుకుతారని తేల్చారు. నేడు ప్రపంచ శాకాహార దినోత్సవం సందర్భంగా కథనం...

మాంసాహారులతో పోలిస్తే శాకాహారం తీసుకునే వారిలో ఊబకాయం, అధిక బరువు, గుండె జబ్బులు వంటి వాటితో సంభవించే మరణాలు తగ్గుతాయని 2023లో జరిగిన ఒక అధ్యయనం తేల్చింది. రక్తపోటు, టైప్ 2 డయాబెటిస్ వంటి వాటితో వచ్చే ప్రమాదాలు తక్కువని తేలింది. హైపర్ టెన్షన్, కొన్ని రకాల కేన్సర్లు దూరమవుతాయని, దీనికి కారణం శాకాహారంలో ఫైబర్, విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉండడమే కారణం.

ఏది మంచిది

మాంసాహారంలో అధిక నాణ్యత ప్రొటీన్, బి6, బి12, ఇనుము, జింక్, ఒమేగా3, కొవ్వు ఆమ్లాలు వంటి పోషకాలుంటాయి. కండరాల పనితీరు, ఎర్ర రక్తకణాల ఉత్పత్తికి దోహదపడుతుంది. కానీ ఎరుపు, ప్రాసెస్ చేసిన మాంసాన్ని తినడం వల్ల గుండె జబ్బులు, కేన్సర్ ప్రమాదాలు ఎక్కువ. పప్పు దినుసులు, బీన్స్, గింజలు, సోయా, చియా సీడ్స్ ఫ్లెక్స్ సీడ్స్, గుమ్మడి గింజలు, వాల్‌నట్స్, బాదం, పాలు, పాల పదార్థాలు, బచ్చలి, పాలకూర, బీట్ రూట్, మష్రూమ్, బంగాళదుంప, క్యారెట్, అరటిపండు, పనస, సపోటా వంటి వాటిలో ఈ పోషకాలన్నీ లభిస్తాయి. శాకాహారంలో విటమిన్లు, ఖనిజాలు, ఫైబర్ ఉంటుంది. సంతృప్త కొవ్వులు తక్కువ. దీనివల్ల కొలెస్ట్రాల్, రక్తపోటు సాధారణ స్థితిలో ఉంటాయి. పీచు పదార్థాలతో జీర్ణ వ్యవస్థ సక్రమంగా పనిచేస్తుంది. యాంటీ ఆక్సిడెంట్లతో రోగ నిరోధక వ్యవస్థ బలపడుతుంది.

శాకాహారంతో మేలు



కేవలం శాకాహారం మాత్రమే తీసుకునే వారు ఆరోగ్య పరంగా మెరుగైన స్థితిలో ఉంటారు. మాంసాహారం తీసుకునే వారికి కొన్ని ఇబ్బందులు తప్పవు. శారీరక, మానసిక పరిస్థితి మరింత బలంగా ఉండేందుకు శాకాహారం ఎక్కువగా దోహదపడుతుంది. మొత్తమ్మీద ఆరోగ్యపరంగా మాంసాహారుల కంటే శాకాహారుల పరిస్థితి బాగుంటుందనడంలో సందేహం లేదు.

- పి.వీణ, డైటీషియన్

టెట్ పరీక్షా కేంద్రాలు ఇవే

విశాఖపట్నం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నిర్వహణకు ఉమ్మడి విశాఖ జిల్లాలో ఎనిమిది కేంద్రాలను ఏర్పాటుచేశామని జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ ఒక ప్రకటనలో తెలిపారు. అనకాపల్లి జిల్లా లంకెలపాలెం సమీపంలోని మంత్రిపాలెం నోబెల్ ఇంజనీరింగ్ కళాశాల, విశాఖ జిల్లా చినముషిడివాడలోని జెన్ టెక్నాలజీస్, అయాన్ డిజిటల్ జోన్ -1, 2, పెదగంట్యాడ బీసీ రోడ్డు కేఎల్‌రావునగర్‌లోని ఎస్‌వీఎస్ టెక్నాలజీస్ అండ్ సొల్యూషన్స్, కొమ్మాది చైతన్య ఇంజనీరింగ్ కళాశాల, ఎన్ఏస్‌టీఎల్ రోడ్డు బుచ్చిరాజుపాలెం 67వ వార్డు సచివాలయం ఎదురుగా ఉన్న ఏడీజడ్ అరోనా డిజిటల్ జోన్, షీలానగర్ అయాన్ డిజిటల్ జోన్‌లో కేంద్రాలు ఏర్పాటుచేశామన్నారు. అక్టోబరు మూడోతేదీ నుంచి 21వ తేదీ వరకు ఉదయం పరీక్షకు 9.30గంటలలోగా, మధ్యాహ్నం పరీక్షకు 2.30 గంటలలోగా కేంద్రాలకు చేరుకోవాలన్నారు.

అదనపు సమాచారం కోసం డీఈవో కార్యాలయంలో టెట్ సెల్ ఏర్పాటుచేశామన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు తమతోపాటు రెండు పాసుపోర్టు సైజు ఫొటోలు, ఆధార్‌కార్డు ఒరిజినల్, జిరాక్స్ కాపీ ఒకటి, హాల్‌టికెట్, బాల్‌పాయింట్ పెన్ను తీసుకురావాలన్నారు. కేంద్రాల్లోకి ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతించమన్నారు. పరీక్షకు సంబంధించి సందేహాలు, సమాచారం కోసం డీఈవో కార్యాలయం సూపరింటెండెంట్ జి.సన్యాసిరావు (9177292969), ఏఎస్‌వో సీహెచ్ సుబ్రహ్మణ్యం (9849245230), సీనియర్ అసిస్టెంట్ పవన్ (9618584051), డీఎస్‌వో మహేష్ (8328524861)లను సంప్రతించాలన్నారు.

క్రైం... crime news

47 కిలోల గంజాయితో ఇద్దరి అరెస్టు



పట్టుబడిన గంజాయి, నిందితులతో పోలీసులు

మాడుగుల రూరల్, సెప్టెంబరు 30 : మన్యం నుంచి మైదాన ప్రాంతానికి కారులో తరలిస్తున్న 47 కిలోల గంజాయిని సోమవారం మాడుగుల పోలీసులు స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేశారు. దీనికి సంబంధించి మాడుగుల ఎస్ఐ నారాయణరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పాడేరు ఏజెన్సీ ప్రాంతం నుంచి కారులో గంజాయి తీసుకు వస్తున్నారనే ముందస్తు సమాచారం మేరకు సోమవారం తాటిపర్తి గ్రామ శివారులో పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో కారుని ఆపి తనిఖీ చేయగా.. అందులో 47 కిలోల గంజాయి ప్యాకెట్లు లభ్యమయ్యాయి. గంజాయి రవాణా చేస్తున్న ఉత్తరప్రదేశ్‌కి సూరజ్‌కుమార్, అంకిత్ ఖోకర్‌లను అరెస్టు చేశామని ఎస్ఐ తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కి తరలించామని చెప్పారు.

బాలికపై లైంగిక దాడి కేసు..

ముద్దాయికి ఐదేళ్ల జైలు

తుమ్మపాల (మునగపాక), సెప్టెంబరు 30 : బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో నేరం రుజువు కావడంతో ముద్దాయికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.17 వేలు జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు న్యాయమూర్తి సోమవారం తీర్పు చెప్పారని జిల్లా ఎస్పీ ఎం.దీపిక సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మునగపాక మండలంలోని నాగవరం గ్రామానికి చెందిన లారీ క్లీనర్ బండారు రమణ, 2019 ఫిబ్రవరి 10వ తేదీన అదే గ్రామంలో మూడో తరగతి చదువుతున్న ఒక బాలికకు మాయమాటలు చెప్పి, మేడ పైకి తీసుకెళ్లి లైంగిక దాడికి ఒడిగట్టాడు. బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విచారణ అనంతరం బలమైన ఆధారాలను కోర్టు ముందు వుంచారు. నిందితుడిపై మోపిన అభియోగాలు వాస్తవమేనని నిర్ధారణ కావడంతో పోక్సో కోర్టు న్యాయమూర్తి జి.ఆనందిని, ముద్దాయి బండారు రమణకు ఐదు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.17 వేలు జరిమానా విధించారు.

కిరండోల్ రైలుకు అదనపు విస్టాడోమ్, థర్డ్ ఏసీ ఎకానమీ కోచ్

విశాఖపట్నం, సెప్టెంబరు 30: ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని విశాఖ, కిరండోల్ మధ్య నడుస్తున్న 08551, 08552 నంబరు గల రైళ్లకు పరిమిత తేదీల్లో అదనంగా ఒక విస్టాడోమ్, థర్డ్ ఏసీ ఎకానమీ కోచ్‌ను జత చేస్తున్నట్టు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. విశాఖ-కిరండోల్ రైలుకు (08551) ఈనెల 3, 5, 7, 9, 11, 13, 15, 17, 19 తేదీల్లో... తిరుగు ప్రయాణంలోని కిరండోల్- విశాఖ రైలుకు (08552) ఈనెల 4, 6, 8, 10, 12, 14, 16, 18, 20వ తేదీల్లో అదనంగా ఒక విస్టాడోమ్ కోచ్ అందుబాటులో ఉంచనున్నట్టు పేర్కొన్నారు. అలాగే విశాఖ- కిరండోల్ రైలుకు (08551) ఈనెల 2, 4, 6, 8, 10, 12, 14, 16, 18, 20వ తేదీల్లో...తిరిగి కిరండోల్-విశాఖ రైలుకు (08552) ఈనెల 3, 5, 7, 9, 11, 13, 15, 17, 19, 21 తేదీల్లో అదనంగా ఒక థర్డ్ ఏసీ ఎకానమీ కోచ్‌ను జత చేస్తున్నట్టు వివరించారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	95.00
లైవ్ ధర	115.00
విత్ స్కిన్	200.00
స్కిన్ లెస్	210.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	535
విజయనగరం	539
శ్రీకాకుళం	539

అర్జీలను త్వరగా పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్



ఫిర్యాదుదారునితో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

తుమ్మపాల, సెప్టెంబరు 30: ప్రజలు అందజేస్తున్న ఫిర్యాదులపై సత్వరమే స్పందించి పరిష్కరించాలని, ప్రజలు ఒకే సమస్యపై పలుమార్లు అర్జీలు అందజేయాల్సిన పరిస్థితి ఏర్పడకూడదని కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఆమె పలువురి నుంచి అర్జీలు స్వీకరించి, వారితో మాట్లాడారు. ఈ సందర్భంగా పలు శాఖల అధికారులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి, ప్రజలు అందించిన అర్జీలను నిర్ణీత కాలంలో పరిష్కరించేందుకు చొరవ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ జాహ్నవి, డీఆర్ఓ దయానిధి, అధికారులు పాల్గొన్నారు. కాగా కోటవురట్ల, కోటనందూరు మండలాలకు చెందిన కొంతమంది వ్యక్తులు తప్పుడు రికార్డులు సృష్టించి తమ భూములను అక్రమంగా స్వాధీనం చేసుకుంటున్నారని, వారిపై చర్యలు చేపట్టాలని మాకవరపాలెం మండలం గంగవరం పంచాయతీ శివారు కృష్ణాపురం నివాసులు కలెక్టరేట్ వద్ద నిరసనకు దిగారు. దళిత క్రైస్తవులకు ఎస్సీ రిజర్వేషన్లు కల్పించడం రాజ్యాంగ విరుద్ధమని ఎస్సీ, ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గరికిముక్కు సుబ్బయ్య అంటూ కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందించారు. అలాగే ప్రభుత్వం నూతన మద్యం పాలసీని తీసుకువస్తున్నందున ఇప్పటి వరకు ప్రభుత్వ మద్యం షాపుల్లో విధులు నిర్వహిస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని సూపర్‌వైజర్, సేల్స్‌మెన్ ఆందోళన చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

ఎస్పీ కార్యాలయానికి 40 ఫిర్యాదులు

జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో 40 ఫిర్యాదులు అందినట్టు అదనపు ఎస్పీ ఎం.దేవప్రసాద్ పేర్కొన్నారు. ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు, చీటింగ్ తదితర అంశాలపై ఫిర్యాదులు అందాయన్నారు. ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎల్.మోహనరావు, ఎస్ఐ డి.వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

కారిడార్ నిర్వాసిత రైతుల నిరసన



తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసనకు దిగిన కారిడార్ నిర్వాసిత రైతులు

నక్కపల్లి, సెప్టెంబరు 30: మండలంలో విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం భూములిచ్చిన రైతులు సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు మాట్లాడుతూ, జీవనోపాధిగా వున్న భూములను కారిడార్ కోసం రైతులు త్యాగం చేశారని, కానీ భూములను స్వాధీనం చేసుకున్న తరువాత పరిహారం పంపిణీలో అధికారులు నిబంధనలను ఉల్లంఘిస్తున్నారని ఆరోపించారు. గృహాలకు నష్టపరిహారం విషయంలో 2011 సంవత్సరాన్ని ప్రామాణికంగా తీసుకోవడంతో ఆ తరువాత ఇళ్లు నిర్మించుకున్న వారు తీవ్రంగా నష్టపోతారని అన్నారు. భూములను స్వాధీనం చేసుకున్న తేదీని మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో చందనాడ సర్పంచ్ తళ్లా రోహిణి, ఎంపీటీసీ సభ్యుడు గంటా తిరుపతిరావు, అమలాపురం ఉపసర్పంచ్ గంటా నరంగరావు పాల్గొన్నారు.

బాలికోన్నత పాఠశాల టీచర్‌కు షోకాజ్ నోటీసు

ఎలమంచిలి, సెప్టెంబరు 30: పట్టణంలోని తులసీనగర్‌లో వున్న బాలికోన్నత పాఠశాలలో ఇంగ్లీష్ ఉపాధ్యాయురాలు రాధారాణికి సోమవారం షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు జిల్లా ఉప విద్యాశాఖ అధికారి అప్పారావు తెలిపారు.

కల్యాణపులోవ నుంచి నీరు విడుదల

రావికమతం, సెప్టెంబరు 30: మండలంలోని కల్యాణపులోవ జలాశయం నుంచి వంద క్యూసెక్కుల నీటిని సర్పానదిలోకి విడుదల చేసినట్టు ఏఈ సత్యనారాయణదొర తెలిపారు. రిజర్వాయర్ పూర్తి సామర్థ్యం 460 అడుగులు కాగా, సోమవారం నాటికి 458.80 అడుగులకు నీటిమట్టం చేరడంతో రెండు గేట్లు ఎత్తి నీటిని విడిచి పెట్టినట్టు చెప్పారు.

రైవాడ జలాశయం వద్ద..

దేవరాపల్లి: రైవాడ జలాశయం నుంచి వరద నీటిని రెండో రోజూ రెండు గేట్లు ద్వారా శారదా నదిలోకి విడిచి పెట్టారు. జలాశయం గరిష్ఠ నీటిమట్టం 114 మీటర్లు కాగా, సోమవారం 113.85 మీటర్లకు చేరడంతో వరద నీటిని దిగువకు విడుదల చేశారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఉమ్మడి జిల్లా జట్లు ఎంపిక

పరవాడ, సెప్టెంబరు 30: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో ఉమ్మడి విశాఖజిల్లాకు సంబంధించి మండలంలోని పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ పాఠశాలలో అండర్ -14, 17, 19 బాల బాలికల విభాగంలో సోమవారం జిల్లాస్థాయి రైఫిల్ షూటింగ్, వుషూ పోటీలు నిర్వహించారు. తొలుత పోటీలను పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్.సీతాలక్ష్మి, అనకాపల్లి జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి ఎంవీ నాగేశ్వరరావు ప్రారంభించారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వంద మందికి పైగా క్రీడాకారులు హాజరయ్యారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్టు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి వెల్లడించారు. జట్ల ఎంపికలో కోచ్‌లుగా ఎస్.రామ్మోహన్, రమ్య వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సీఈవో కె.నిశాంత్, విశాఖజిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం కార్యదర్శి కేఎం నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర-2047 పోటీల విజేతలకు బహుమతులు

అనకాపల్లి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పోటీ తత్వాన్ని అలవర్చుకొని విజయపథంలో నడవాలని కలెక్టర్ విజయకృష్ణన్ అన్నారు. జిల్లాలోని పాఠశాలు, కళాశాలల్లో స్వర్ణాంధ్ర-2047 వ్యాసరచన, బృంద చర్చలు, ఉపన్యాస పోటీల జిల్లా స్థాయి విజేతలకు సోమవారం ఇక్కడ ఆమె బహుమతులు అందజేసి ప్రసంగించారు.

పోలీసులపై చిరు వర్తకుల దాడి

- ఐస్ క్రీమ్‌లు తీసుకుని డబ్బులు ఇవ్వకపోవడంతో వివాదం
- విశాఖ ఆర్‌కే బీచ్‌లో సంఘటన

విశాఖపట్నం, సెప్టెంబరు 30: ఐస్‌క్రీమ్‌లు తీసుకుని డబ్బులు ఇవ్వకపోవడమే కాకుండా తిరిగి బెదిరింపులకు దిగిన పోలీసులపై చిరు వ్యాపారులు దాడి చేశారు. ఈ సంఘటన ఆదివారం అర్ధరాత్రి విశాఖ ఆర్‌కే బీచ్‌లో చోటుచేసుకుంది. స్థానికులు అందించిన వివరాల ప్రకారం...అల్లూరి సీతారామరాజు జిల్లాలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న షేక్ రహీమ్ నగరానికి వచ్చాడు. నగర పరిధిలో హోంగార్డులుగా పనిచేస్తున్న మిత్రులు నూకరాజు, అనిల్‌తో కలిసి ఆదివారం రాత్రి ఆర్‌కే బీచ్‌కు వెళ్లాడు. ముగ్గురూ అక్కడ ఓ బండి వద్ద ఐస్‌క్రీమ్‌లు తీసుకున్నారు. డబ్బులు ఇవ్వలేదు.

వర్తకుడు డబ్బులు అడగ్గా, తాము పోలీసులమంటూ మమ్మల్నే డబ్బులు అడుగుతావా...అంటూ బెదిరించారు. దీంతో అతను...పోలీసులు అయితే డబ్బులు ఎందుకు ఇవ్వరని ప్రశ్నించడంతో వాగ్వాదం మొదలైంది. అక్కడకు సమీపంలోని చిరు వర్తకులంతా ఐస్‌క్రీమ్ బండి యజమానికి మద్దతుగా నిలిచారు. గొడవ పెరగడంతో ఒక్కసారిగా పోలీసులపై మూకుమ్మడి దాడి చేశారు. ఈ సంఘటనలో రహీమ్, నూకరాజు, అనిల్‌కు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న నైట్ డ్యూటీలోని త్రీటౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన పోలీసులను ఆస్పత్రికి తరలించారు. కాగా ఈ ఘటనపై ఇరు వర్గాలు పోలీసులకు ఫిర్యాదు చేయకపోవడం గమనార్హం. దాడి జరిగిన విషయం వాస్తవమేనని, కానీ ఎవరూ ఫిర్యాదు చేయకపోవడంతో కేసు నమోదు చేయలేదని త్రీటౌన్ పోలీసులు వివరించారు.

నేడు అప్పన్న దర్శన వేళల్లో మార్పు

సింహాచలం, సెప్టెంబరు 30 : వరాహలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో మంగళవారం కొయిల్ తిరుమంజన సేవ పురస్కరించుకుని భక్తులకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 వరకు స్వామివారి దర్శనాలు లభించవని దేవస్థానం ఈఓ వేంద్ర త్రినాథరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. భాద్రపద మాసం అమావాస్యతో మహాలయ పక్షం ముగియడంతో ఆలయాన్ని సంప్రోక్షణ చేయాల్సి ఉన్నందున దర్శనం వేళల్లో మార్పులు చేశామని ఆయన పేర్కొన్నారు.

ప్రణాళికా బద్ధంగా మునిసిపాలిటీ అభివృద్ధి

- ఇప్పటికే తాగునీటి ప్రాజెక్టు, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ, నీటిశుద్ధి పథకాల రూపకల్పనకు సన్నాహాలు
- కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ వెల్లడి
- సభ్యులమంతా సహకరిస్తామని చైర్‌పర్సన్ హామీ




మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయకుమార్, చిత్రంలో చైర్‌పర్సన్ రమాకుమారి.., కౌన్సిల్ సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు, వివిధ విభాగాల అధికారులు

ఎలమంచిలి, సెప్టెంబరు 30 : మునిసిపాలిటీని ప్రణాళికా బద్ధంగా అన్నిరంగాల్లో తీర్చిదిద్దేందుకు అంతా సహకారం అందించాలని ఎమ్మెల్యే సుందరపు విజయ కుమార్ కోరారు. ఇక్కడి మునిసిపల్ కార్యాలయం ఆవరణంలో చైర్‌పర్సన్ రమాకుమారి అధ్యక్షతన సోమవారం నిర్వహించిన కౌన్సెల్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఎలమంచిలి మండలాన్ని అభివృద్ధి చేయడానికి ఓ ప్రక్క జాతీయ రహదారి, మరో పక్క రేల్వే స్టేషన్, బస్‌స్టాండ్ ఉన్నాయని, వీటికి అనుసంధానంగా అభివృద్ధి చేసుకుంటూ మునిసిపాలిటీని అన్ని విధాలా ముందుకు తీసుకువెళదామన్నారు. ఇప్పటికే మునిసిపల్ ప్రజల కోసం సుమారు రూ.100 కోట్ల వ్యయంతో తాగునీటి ప్రాజెక్టు, రూ.60 కోట్ల వ్యయంతో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ, నీటిశుద్ధి పథకాల రూపకల్పనకు ప్రణాళికలు సిద్ధం చేసినట్టు చెప్పారు. మునిసిపల్ మాస్టర్ ప్లాన్‌లో భాగంగా వంద అడుగుల రోడ్డు విస్తరణతో మరింత అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు. మునిసిపల్ కార్యాలయానికి కార్పొరేట్ లుక్ ఉండేలా తీర్చిదిద్దాలని సూచించారు. అనంతరం చైర్‌పర్సన్ రమాకుమారి మాట్లాడుతూ మునిసిపాలిటీ అభివృద్ధికి ఎమ్మెల్యేకు తమవంతు పూర్తి సహకారం అందిస్తామన్నారు. అధికారులు వార్డుల్లో పర్యటించి సమస్యలు తెలుసుకోవాలని సూచించారు. పట్టణంలోకి ఎక్స్‌ప్రెస్ బస్సులు పూర్తిస్థాయిలో వచ్చేందుకు బస్ స్టాండ్ వద్ద ఆటంకంగా ఉన్న ట్రాఫిక్ ఐలాండ్‌ను తొలగించాలని కౌన్సిలర్ మజ్జి రామకృష్ణ కోరారు. అనంతరం పలువురు సభ్యులు ఆయా వార్డుల్లో సమస్యలను సభదృష్టికి తీసుకు వచ్చారు. ఈ సమావేశంలో కమిషనర్ ప్రసాదరాజు, మేనేజర్ విజయ్‌కుమార్, డీఈ వీరయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీను, టీపీవో శ్రీలక్ష్మి, వైస్ చైర్మన్లు బెజవాడ నాగేశ్వరరావు, గుప్తాలతో పాటు కౌన్సిలర్లు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

'పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత'



అచ్యుతాపురంలో జరిగిన స్వచ్ఛతా హీ ర్యాలీలో ఎమ్మెల్యే తదితరులు

అచ్యుతాపురం, సెప్టెంబరు 30 : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా ఇక్కడి మండల కార్యాలయం ఆవరణ నుంచి అధికారులు, ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాల ఎన్‌సీసీ కేడేట్‌లతో కలిసి జంక్షన్ వరకూ ర్యాలీగా వెళ్లారు. అక్కడ మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. పర్యావరణ పరిరక్షణకు అంతా కంకణబద్ధులు కావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. అనంతరం పలుచోట్ల మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో దేవరాయల్, ప్రశాంతి విద్యాసంస్థల చైర్మన్ ధర్మిరెడ్డి ప్రసాద్, శ్రీనివాస్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నియోజకవర్గ సాయి క్రీడా పోటీలు ప్రారంభం

అచ్యుతాపురం రూరల్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు సోమవారం ఇక్కడ ప్రారంభమయ్యాయి. తొలుత ఈ పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణిస్తే భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

నోరు జారిన పందూరు సర్పంచ్

- వంత పాడిన పలువురు వైసీపీ ప్రజాప్రతినిధులు
- ఉద్రిక్తంగా మారిన కోటవురట్ల మండల సమావేశం
- పోలీసులు రంగప్రవేశం
- టీడీపీ వారికి సభా ముఖంగా చీకెట్ల జగదీష్ క్షమాపణ చెప్పడంతో సద్దుమణిగిన వివాదం



సమావేశంలో ఇరువర్గాల వారికి సర్దిచెబుతున్న పోలీసులు

కోటవురట్ల, సెప్టెంబరు 30 : ప్రోటోకాల్ విషయంలో వైసీపీ, టీడీపీ నాయకుల మధ్య జరిగిన వాగ్వాదం కారణంగా కోటవురట్ల మండల సర్వసభ్య సమావేశం రసాభాసగా మారింది. ఎంపీపీ సింగంపల్లి అప్పలనాయుడు అధ్యక్షతన సోమవారం ఉదయం ఇక్కడ సమావేశం ప్రారంభమైంది. గృహ నిర్మాణ శాఖ ఏఈ ప్రసాద్ మాట్లాడుతూ 2016-19 సంవత్సరాల మధ్య ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం కింద మండలానికి మంజూరైన 1046 మంది లబ్ధిదారులు జాబితాను విచారణ చేయమని ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందినట్టు చెప్పారు. మూడు బృందాలుగా ఏర్పడి విచారణ జరుపుతున్నామన్నారు. దీనిపై వైసీపీకి చెందిన పందూరు సర్పంచ్ చీకెట్ల జగదీష్ మాట్లాడుతూ ఈ విచారణకు వచ్చిన హౌసింగ్ ఏఈ గ్రామ సర్పంచ్‌కు సమాచారం ఇవ్వకుండా టీడీపీకి చెందిన బ్రోకర్లతో ఊరిలో తిరుగుతున్నారని ఆరోపించారు. దీంతో కొడవటిపూడి ఎంపీటీసీ యలమంచిలి ప్రకాష్ అభ్యంతరం తెలిపారు. టీడీపీ బ్రోకర్లు అనడం ఏమిటని ప్రశ్నించారు. నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని హెచ్చరించారు. ప్రకాష్‌తో వైసీపీకి చెందిన సర్పంచులు గోపాకృష్ణ, వరహాలబాబు, శివరామ్ వాగ్వాదానికి దిగారు. సర్పంచులకు తెలియకుండా హౌసింగ్‌పై ఎలా విచారణ జరుపుతారని అనడంతో ఇరువర్గాల మధ్య అరుపులు, కేకలు చోటు చేసుకుని సమావేశం ఉద్రిక్తంగా మారింది. దీంతో పోలీసులు రంగప్రవేశం చేసి ఇరువర్గాల వారికి నచ్చజెప్పారు. చివరిలో పందూరు సర్పంచ్ చీకెట్ల జగదీష్ మాట్లాడుతూ తాను కావాలని అలా అనలేదని, నోరుజారిపోయిందని క్షమాపణ చెప్పడంతో వివాదం సద్దుమణిగింది. అనంతరం నీలిగుంట సర్పంచ్ వరహాలబాబు మాట్లాడుతూ గత రెండు సమావేశాలకు రాని అధికారులపై ఎటువంటి చర్యలు తీసుకున్నారో చెప్పిన తరువాతే సమావేశం జరపాలని పట్టుబట్టారు. దీనిపై వైస్ ఎంపీపీ సీతాబాబు సమాధానం తరువాత చెపుతారంటూ సమావేశాన్ని కొనసాగించారు. టీకేపల్లి ఎంపీటీసీ రాంబాబు, పాములవాక, కొడవటిపూడి సర్పంచులు సత్యవతి, అప్పారావు మాట్లాడుతూ జల్‌జీవన్ మిషన్ పథకం వల్ల లాభం కంటే నష్టమే ఎక్కువ జరిగిందంటూ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారిని నిలదీశారు. ఈ పైప్ లైన్లు వేసేందుకు బాగున్న రోడ్లను తేవ్వి వదిలేశారని పేర్కొన్నారు. చౌడువాడ సర్పంచ్ గోపాలం మాట్లాడుతూ రోడ్లకు ఇరువైపులా పెరిగిపోయిన తుప్పలను తొలగించాలని కోరారు. జడ్పీటీసీ ఉమాదేవి మాట్లాడుతూ మండలంలో సర్పా, వరహా నదుల్లో ఇసుక అక్రమ తవ్వకాలను అరికట్టాలని కోరారు. కోటవురట్ల సభ్యుడు ఎంపీటీసీ సూర్యారావు మాట్లాడుతూ ఇద్దరు ఎంఈవోలు ఉన్నా సమావేశానికి రాకపోవడం పట్ల ఆగ్రహ వ్యక్తంచేశారు. అనంతరం మరికొంతమంది సభ్యులు సమస్యలను సభ దృష్టికి తీసుకు వచ్చారు. ఎంపీడీవో కాశీవిశ్వనాథం, వైస్ ఎంపీపీ సీతాబాబుతో పాటు వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

సంకల్ప కాపు సంక్షేమ సంఘ అధ్యక్షుడిగా అప్పారావు



ఎమ్మెల్యే పంచకర్లను కలిసి సత్కరిస్తున్న సభ్యులు

సబ్బవరం, సెప్టెంబరు 30 : మండలం సంకల్ప కాపు సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా టీడీపీకి చెందిన గవర అప్పారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల కాపు నేతలు ఇందలి వెంకటరమణ, సాలాపు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం ఇక్కడ జరిగిన సమావేశంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా బలిరెడ్డి సత్యనారాయణ, కార్యదర్శిగా కుంచా ప్రసాద్, కోశాధికారిగా రేసుపూడి రమణ, సహాయ కార్యదర్శిగా కంచిపాటి రాంబు ఎన్నికయ్యారు. అనంతరం ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబును కార్యవర్గ సభ్యులు కలవడంతో ఆయన శుభాకాంక్షలు తెలిపారు. కాపు సంక్షేమ సంఘం నేతలు గవర సత్తిబాబు, పడాల వెంకటరమణ, ఆకుల గణేష్, జెట్టి ప్రసాద్, వాకాడ కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

సతకంపట్టు కనకదుర్గ ఆలయం ముస్తాబు

- శరన్నవరాత్రి ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు చేపడుతున్న నిర్వాహకులు




రంగులతో సర్వాంగసుందరంగా తీర్చిదిద్దిన ఆలయం, కొలువుదీరిన దుర్గమ్మ

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 30 : పట్టణంలోని గవరపాలెం సతకంపట్టులో కొలువుదీరిన కనకదుర్గమ్మ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు చేపడుతున్నారు. అక్టోబరు మూడవ తేదీ నుంచి 12వ తేదీ వరకు ఈ వేడుకలను అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆలయ శాశ్వత చైర్మన్, నిర్వాహకులు కాండ్రేగుల నాయుడు, అలయ వ్యవస్థాపకులు పీవీ రమణ మాట్లాడుతూ నవరాత్రి వేడుకల్లో భాగంగా దుర్గమ్మవారు భక్తులకు రోజుకో అవతారంలో దర్శనమిస్తారన్నారు. ప్రతి రోజూ విశేష పూజలు జరుపుతామన్నారు. భవానీ మాలధారణ చేసిన భక్తులకు రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ ఆర్థిక సహకారంతో అన్నసమారాధన నిర్వహిస్తున్నామన్నారు. అలాగే, ప్రముఖ శిల్పి రమేష్ రూపొందించిన మహాగణపతి నవదుర్గల భారీ ఊరేగింపు దసరా పండగ రోజున జరుపుతామని కమిటీ చైర్మన్ భీమరశెట్టి వరహా నూకరాజు తెలిపారు. ఇదిలావుంటే, శరన్నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు నరసింగరావుపేటలో సోమవారం పందిరి రాట వేశారు. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ అమ్మవారికి పూజలు నిర్వహించారు. కమిటీ సభ్యులు వియ్యపు శ్రీనివాసయాదవ్, మనోహర్, శ్రీరాములు, నాగేశ్వరరావు, కాసులు తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

చెరువు ఆక్రమణ!

... 5వ పేజీ తరువాయి



ఆక్రమణకు గురవుతున్న కొత్త చెరువు

గురించి పట్టించుకోవడంలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. చెరువు గట్టును ఆక్రమించి ఇళ్లు నిర్మించుకున్న వారికి పంచాయతీ అధికారులు ఆస్తి పన్ను విధిస్తున్నారని, దీనిని ఆధారంగా చేసుకుని విద్యుత్ సిబ్బంది కరెంటు కనెక్షన్లు ఇస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. చెరువు గట్టు, గర్భం ఆక్రమణకు గురైతే భవిష్యత్తులో చెరువులో పూడిక తీత పనులు చేపట్టడం సాధ్యం కాదని అంటున్నారు. తక్షణమే ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి తుమ్మపాల కొత్తచెరువులో ఆక్రమణలను తొలగించాలని కోరుతున్నారు.

ఆక్రమణలను గుర్తించి చర్యలు తీసుకుంటాం

- ఈశ్వరరావు, తుమ్మపాల పంచాయతీ ఈవో

తుమ్మపాల పంచాయతీ పరిధిలోని కొత్త చెరువులో ఆక్రమణలను గుర్తించి చర్యలు తీసుకుంటాం. ఎంత మేర ఆక్రమణకు గురైందో రెవెన్యూ అధికారులతో సర్వే చేయిస్తాం. ఆక్రమణదారులకు నోటీసులు ఇవ్వడంతోపాటు చట్టపరంగా చర్యలు తీసుకుంటాం.

గైనిక్ విభాగం డాక్టర్ తీరుపై ఆశ కార్యకర్తలు ఆందోళన

- ఎన్టీఆర్ వైద్యాలయం ఎదుట నినాదాలు
- డెలివరీ కేసులు చూస్తున్న తరుణంలో పొరపాటు జరిగి ఉండవచ్చునని వైద్యురాలు చెప్పడంతో సమస్య పరిష్కారం



బాధితురాలికి షేక్‌హ్యాండ్ ఇస్తున్న డాక్టర్ విష్ణుప్రియ

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 30 : ఇక్కడి ఎన్టీఆర్ వైద్యాలయం గైనిక్ విభాగంలో ఆశ కార్యకర్త పట్ల దురుసుగా వ్యవహరించిన డాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం వైద్యాలయం ఎదుట ఆశ కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. జగన్నాథపురం నుంచి గొలగాని కుమారి అనే గర్భిణిని తగరంపూడి ఆశ వర్కర్ వెంకటాపు లక్ష్మి కాన్పు కోసం ఆదివారం సాయంత్రం తీసుకువచ్చారు. సోమవారం ఉదయం ఆమెకు డెలివరీ సమయంలో తనపట్ల డాక్టర్ విష్ణుప్రియ దురుసుగా వ్యవహరించి, గెంటివేశారని ఆశ కార్యకర్త లక్ష్మి ఆరోపించారు. విషయం తెలుసుకున్న కార్యకర్తలు సీఐటీయూ నాయకులు జికోటేశ్వరరావు, గనిశెట్టి సత్యనారాయణ ఆధ్వర్యంలో వైద్యాలయం ఎదుట బైఠాయించి ధర్నా చేపట్టారు. వైద్యురాలిపై చర్యలు తీసుకోవాలంటూ నినాదాలు చేశారు. సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్, పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్ సూచనల మేరకు డాక్టర్ విష్ణుప్రియా ఆందోళన జరిగే ప్రదేశానికి వచ్చారు. ఉదయం మేడపై ఆపరేషన్ థియేటర్‌లో ఒక కేసు, కింద మరొక కేసు చూస్తున్నానన్నారు. తల్లీబిడ్డకు ప్రమాదం జరిగితే పరిస్థితి ఏమిటో అర్థం చేసుకోవాలని డాక్టర్ విష్ణుప్రియా పేర్కొన్నారు. ఎవరిపైనా తమకు విభేదాలు లేవని ఆ టెన్షన్‌లో ఉండడం వల్ల పొరపాటు జరిగి ఉండొచ్చునని ఆమె వివరించారు. దీంతో వారంతా ఆందోళనను విరమించారు.

కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులు ధర్నా

- సమస్యల పరిష్కారానికి నినాదాలు
- ఆర్డీవోకు వినతి సమర్పణ



ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 30 : వివిధ ప్రభుత్వ విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. తొలుత పీటీడీ కాంప్లెక్స్ వద్ద గల సీఐటీయూ కార్యాలయం నుంచి ప్రదర్శనగా ఆర్డీవో కార్యాలయానికి చేరుకున్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, సమస్యలు పరిష్కరించి అందరినీ పర్మినెంట్ ఉద్యోగులుగా పరిగణలోకి తీసుకోవాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వరంగ పరిశ్రమలు, సంస్థలలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికుల సంఖ్య విపరీతంగా పెరిగిందన్నారు. పర్మినెంట్ కార్మికులతో సమానంగా పనిచేస్తున్నా చాలీచాలని వేతనాలతో సదరు కార్మికులు జీవనం సాగిస్తున్నారన్నారు. వీరికి చట్ట ప్రకారం పీఎఫ్, ఈఎస్ఐ, బోనస్, సెలవులు, గ్రాడ్యూటీ, రిటైర్‌మెంట్ బెనిఫిట్ హక్కులన్నీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీవో చిన్నికృష్ణకు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ నాయకులు ఆర్.శంకరరావు, జి.కోటేశ్వరరావు, వీవీ శ్రీనివాసరావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు నిమ్మకాయల అజయ్, గాంధీ, సంతోష్, అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

మూలపర్ర జీడి తోటల్లో అక్రమంగా ఇసుక నిల్వలు

- గుర్తించిన పోలీస్, రెవెన్యూ అధికారులు
- అక్కడికక్కడే వేలం నిర్వహణ



ఇసుక నిల్వల వివరాలపై ఆరా తీస్తున్న ఎస్ఐ సన్నిబాబు

నక్కపల్లి, సెప్టెంబరు 30 : మూలపర్ర గ్రామ సమీపంలోని జీడి తోటల్లో భారీగా ఇసుకను అక్రమంగా నిల్వచేసినట్టు పోలీసులు సోమవారం గుర్తించారు. సీఐ కుమార స్వామి పర్యవేక్షణలో ఎస్ఐ సన్నిబాబు, రెవెన్యూ సిబ్బంది సదరు జీడితోటల్లో తనిఖీలు నిర్వహించారు. సుమారు వంద టన్నుల ఇసుక నిల్వచేసినట్టు గుర్తించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రెవెన్యూ, పంచాయతీ అధికారుల సమక్షంలో ఈ ఇసుకను సీజ్ చేసి, అక్కడే వేలంపాట నిర్వహించారు. 12మంది పాటదారులు వేలంలో పాల్గొనగా,రూ. లక్షా మూడు వేలకు పాటను ఖరారు చేశారు. ఈ మొత్తాన్ని పంచాయతీకి అందజేస్తున్నట్టు అధికారులు తెలిపారు.

'సక్షం' అంగన్‌వాడీగా కాగిత

నక్కపల్లి, సెప్టెంబరు 30 : మండలంలోని కాగిత గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రాన్ని సమగ్ర పోషణ పరిరక్షణ కేంద్రం (సక్షం) అంగన్‌వాడీ కేంద్రంగా మార్పు చేశారు. ఈ మేరకు సోమవారం సర్పంచ్ పోతంశెట్టి రాజేశ్, ఎంపీటీసీ సభ్యుడు ఆకేటి గోవిందరావు ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం సమీపంలో కూలిన భారీ చెట్టు

అచ్యుతాపురం రూరల్, సెప్టెంబరు 30 : మండల కేంద్రం అచ్యుతాపురం సమీపం అనకాపల్లి రోడ్డులో గల సామిల్లు వద్ద భారీ మర్రిచెట్టు సోమవారం రాత్రి రోడ్డుకు అడ్డంగా కూలింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చెట్టు కొంతవరకు దెబ్బతింది. దీంతో మొదలుతో సహా నేలకొరిగింది. కొమ్మలు విద్యుత్ తీగలపై పడడంతో సరఫరాకు అంతరాయం ఏర్పడింది. రాత్రి వేళలో ఈ ఘటన జరగడంతో అధికారులు పట్టించుకోలేదని పలువురు వాపోయారు. ట్రాఫిక్ నిలిచిపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

తహసీల్దార్‌గా శ్రీనివాసరావు బాధ్యతలు



కశింకోట, సెప్టెంబరు 30 : ఇక్కడి తహసీల్దార్‌గా అడబాల శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. విశాఖ నుంచి బదిలీపై ఇక్కడకు విచ్చేశారు. ఇప్పటి వరకు ఈ స్థానంలో ఉన్న సత్యనారాయణ పాయకరావుపేటకు వెళ్లారు.

ఎక్సైజ్ సీఐగా లక్ష్మణ్‌నాయుడు బాధ్యతలు



అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 30 : అనకాపల్లి ఎక్సైజ్ సీఐగా వై.లక్ష్మణ్‌నాయుడు ఆదివారం సాయంత్రం బాధ్యతలు చేపట్టారు. గాజువాక నుంచి బదిలీపై ఇక్కడకు విచ్చేశారు. ఇప్పటి వరకు ఇక్కడున్న అనిల్‌కుమార్ సబ్బవరానికి బదిలీపై వెళ్లారు.

ఉత్సవ విగ్రహాలుగా ఎంపీటీసీలు

... 5వ పేజీ తరువాయి

చూస్తే.. ఎంపీటీసీ సభ్యులుగా ఎందుకు గెలిచామో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా వైసీపీ స్థానంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం స్థానిక సంస్థలకు ప్రాధాన్యం ఇస్తున్న నేపథ్యంలో తమ గౌరవ వేతనాల బకాయిలకు నిధులు విడుదల చేస్తుందని ఎంపీటీసీ సభ్యులు ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు.

'పీలా'ను సత్కరించిన ఐటీడీపీ ఇన్‌చార్జిలు



పీలా గోవింద్‌కు జ్ఞాపిక అందిస్తున్న ఐటీడీపీ ఇన్‌చార్జిలు

ఎస్.రాయవరం, సెప్టెంబరు 30 : ఆంధ్రప్రదేశ్ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రెక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన పీలా గోవింద సత్యనారాయణను పలువురు టీడీపీ నాయకులు సోమవారం అనకాపల్లిలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా ఐటీడీపీ ఇన్‌చార్జి పీలా శ్రీనివాస్, పాయకరావుపేట నియోజకవర్గం ఇన్‌చార్జి మలిపెద్ది సతీష్, చోడవరం నియోజకవర్గం ఇన్‌చార్జి రాపేటి గోపీ, మండల ప్రధాన కార్యదర్శి గట్టెం రమేష్, పార్లమెంట్ కమిటీ సభ్యులు మడదా రాంబాబు తదితరులు పూమాలలతో ఘనంగా సత్కరించారు.

సంపద కేంద్రాలతో చెత్త సమస్యకు పరిష్కారం



సంపద కేంద్రంలో వానపాములు వదులుతున్న ఎంపీడీవో

పాయకరావుపేట రూరల్, సెప్టెంబరు 30 : మండలంలోని అన్ని గ్రామాల్లో సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకు రావాలని ఎంపీడీవో జయప్రకాశరావు సూచించారు. మంగవరం సంపద కేంద్రంలో సోమవారం వానపాములను విడిచిపెట్టి మాట్లాడారు. ఈ కేంద్రాలు సద్వినియోగం ద్వారా గ్రామాల్లో చెత్త సమస్యలను పరిష్కరించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ చంద్రశేఖర్, కార్యదర్శులు వై.వి.సత్యనారాయణ, జె.నరేశ్‌కుమార్, వైసీపీ నాయకుడు వంగలపూడి రామారావు, సిబ్బంది పాల్గొన్నారు.

కౌన్సిల్ సమావేశంలో ఇసుక దుమారం

... 5వ పేజీ తరువాయి

నిర్మూలనకు పబ్లిక్ టాయిలెట్స్ అవసరమని అన్నారు. దీనిపై ఆ ప్రాంత ప్రజలతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామని అన్నారు. మెయిన్ రోడ్డులో ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగించాలని వైస్‌చైర్మన్ తమరాన అప్పలనాయుడు కోరారు. టీడీపీ కౌన్సిలర్ మధుబాబు మాట్లాడుతూ, దనిమిరెడ్డి వీధిలో ఐస్ ప్లాంట్ మిషనరీ, వాటర్ ట్యాంక్‌ను డ్రైనేజీ కాలువ మీద నిర్మించారని, వాటిని కూడా తొలగించాలని అన్నారు. వైసీపీ కౌన్సిలర్ మాకిరెడ్డి బుల్లిదొర మాట్లాడుతూ, స్కేటింగ్ రింక్ ప్రాంగణంలో బాక్సింగ్ రింగ్, ఇండోర్ హాల్ నిర్మాణ పనులు రద్దు చేసినట్టు స్పోర్ట్ అథారిటీ నుంచి సమాచారం ఏమైనా ఉందా అని అడిగారు. టీడీపీ కౌన్సిలర్ శ్రీకాంత్ మాట్లాడుతూ, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అన్ని సౌకర్యాలతో క్రీడాకారుల కోసం ఇండోర్ స్టేడియం నిర్మాణానికి స్పీకర్ అయ్యన్నపాత్రుడు చర్యలు తీసుకున్నారని తెలిపారు.

దసరాకు ప్రత్యేక బస్సులు

... 5వ పేజీ తరువాయి

అనకాపల్లి కాంప్లెక్స్‌కు వచ్చేలా చర్యలు చేపడతామని ఆయన చెప్పారు.

పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సమయంలో అనకాపల్లి నుంచి పలు ప్రాంతాల్లోని పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్టు ఏడీఎం రవిచంద్ర తెలిపారు. అనకాపల్లి నుంచి విజయవాడ వెళ్లి తిరిగి అనకాపల్లి చేరుకునేందుకు ఒక్కో ప్రయాణికుడి నుంచి రూ.900లు చార్జీ వసూలు చేస్తామన్నారు. అలాగే అనకాపల్లి నుంచి విజయవాడ, ద్వారకాతిరుమల, తిరిగి అనకాపల్లికి రూ.950లు, అనకాపల్లి నుంచి విజయవాడ, ద్వారకాతిరుమల, ద్వారపూడి మీదుగా తిరిగి అనకాపల్లికి రూ.1,000, అనకాపల్లి నుంచి భద్రాచలం, విజయవాడ, ద్వారకాతిరుమల మీదుగా తిరిగి అనకాపల్లికి రూ.1,220లు, అనకాపల్లి నుంచి భద్రాచలం, పర్ణశాల, విజయవాడ, ద్వారకాతిరుమల, ద్వారపూడి మీదుగా తిరిగి అనకాపల్లికి రూ.1,300 చార్జీ వసూలు చేస్తామన్నారు. పల్లెవెలుగు బస్సులకు మాత్రమే ఈ చార్జీలు వర్తిస్తాయన్నారు.

దుర్వాసన భరించాల్సిందేనా!?

... 5వ పేజీ తరువాయి

జోనల్ కార్యాలయ ఆవరణలో ఖాళీగా ఉన్న స్థలంలో డంపింగ్ చేసి, ఇక్కడి నుంచి డంపర్ లారీల ద్వారా కాపులుప్పాడ పంపడం మొదలుపెట్టారు. అయితే ఎప్పటికప్పుడు పూర్తిస్థాయిలో చెత్తను తరలించకుండా కొంతమేర అక్కడే వుంచుతున్నారు. వర్షాలకు ఇది కుళ్లిపోయి తీవ్ర దుర్వాసన వస్తున్నది. ఈగల బెడద కూడా పెరిగింది. సుమారు పదేళ్ల నుంచి ఈ సమస్యకు అధికారులు ముగింపు పలకలేదు. అనకాపల్లిలో సేకరించిన చెత్తను సుమారు 65 కిలోమీటర్ల దూరంలో వున్న కాపులుప్పాడకు తరలించడానికి రవాణా ఖర్చులు తడిసిమోపెడు అవుతున్నాయి. కంపోస్టు యార్డును వేరే ప్రాంతానికి తరలించడంలో జరుగుతున్న జాప్యంపై జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడును 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా, శంకరం వద్ద వున్న ఖాళీ స్థలంలో చెత్తను డంప్ వేసి, వెంటనే పెద్ద వాహనాల్లో దూర ప్రాంతాలకు తరలించాలని భావించామని, కానీ ఇక్కడకు సమీపంలోనే కలెక్టరేట్ కాంప్లెక్స్ నిర్మించే యోచన వుండడంతో విరమించామన్నారు. బవులవాడ ప్రాంతంలో స్థలాన్ని పరిశీలించామని, కానీ పట్టణానికి చాలా దూరంగా వుందన్నారు. కంపోస్టు యార్డును తరలించేందుకు స్థలాలను పరిశీలిస్తున్నామని, అనువైన స్థలం లభించిన వెంటనే టాన్సిట్ డంపింగ్ యార్డును అక్కడకు మార్చి, ప్రస్తుతం మాదిరిగానే పెద్ద వాహనాల్లో లోడింగ్ చేసి కాపులుప్పాడకు తరలిస్తామని చెప్పారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం : ఎమ్మెల్యే కొణతాల



పౌష్టికాహార మాసోత్సవాల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొణతాల



పరవాడ అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన సీమంతాల్లో ఎంపీపీ తదితరులు

కశింకోట, సెప్టెంబరు 30 : అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీరు, టాయిలెట్ల మరమ్మతు తదితరాలకు నిధులు మంజూరైనట్టు ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ తెలిపారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా సోమవారం ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఇక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. పౌష్టికాహారం తీసుకోవడం వల్ల ప్రయోజనాలను వివరించారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన జరిపారు. రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రెక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, నాయకులు గొంతిన శ్రీనివాసరావు, కాయల మురళీ, ఉగ్గిన రమణమూర్తి, వేగి గోపీ, సిదిరెడ్డి శ్రీనివాసరావు, కాండ్రేగుల సతీష్, బుదిరెడ్డి చిన్న, పావాడ కామరాజు, కర్రి వెంకట సత్యనారాయణ, తాకాశి కృష్ణ పాల్గొన్నారు.

పరవాడ : పోషకాహారాన్ని తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చునని ఎంపీపీ పైలా వెంకట పద్మలక్ష్మి అన్నారు. పరవాడ -2 అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. పోషకాహారం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతాలు జరిపారు. సర్పంచ్ సిరపురపు అప్పలనాయుడు, ఎంపీటీసీ సభ్యుడు పైలా శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ చుక్క రామునాయుడు, ఉప సర్పంచ్ బండారు రామారావు, నాయకులు రెడ్డి శ్రీనివాసరావు, కూండ్రపు సోమునాయుడు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్, టీచర్లు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

స్పీకర్ అయ్యన్నను కలిసిన ఎన్‌ఆర్‌ఐ


స్పీకర్ అయ్యన్నపాత్రుడుకు వినతిపత్రం అందజేస్తున్న ఎన్‌ఆర్‌ఐ వెంకటరమణ

నాతవరం, సెప్టెంబరు 30 : అమెరికా పర్యటనలో ఉన్న స్పీకర్ అయ్యన్నపాత్రుడుని టీడీపీ నాయకుడు ఎన్‌ఆర్‌ఐ పైలా వెంకటరమణ కలిసి నాతవరం గ్రామాన్ని అభివృద్ధి చేయాలని వినతి పత్రం అందజేశారు. నాతవరం అభివృద్ధిపై వారు చర్చించారు. నాతవరంలో బస్ షెల్టర్ ఏర్పాటు, కోల్డ్‌స్టోరేజి ఏర్పాటు, మంచినీటి సమస్య పరిష్కారం, మార్కెట్‌యార్డు అభివృద్ధి తదితర సమస్యలు పరిష్కరించాలని అయ్యన్నపాత్రుడుని ఎన్‌ఆర్‌ఐ వెంకటరమణ కోరారు.

చెరకు రైతుల బకాయిలు తీర్చండి

- మొలాసిస్, పంచదారలను విక్రయిస్తే బకాయిలు చెల్లించవచ్చు
- గోవాడ యాజమాన్యానికి మాజీ ఎమ్మెల్యే ధర్మశ్రీ సూచన

చోడవరం, సెప్టెంబరు 30: గోవాడ షుగర్ ఫ్యాక్టరీలో గత క్రషింగ్ సీజన్‌లో ఉత్పత్తి చేసిన మొలాసిస్, పంచదారలను విక్రయించి రైతుల బకాయిలు తీర్చాలని మాజీ ఎమ్మెల్యే ధర్మశ్రీ సూచించారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, ఫ్యాక్టరీలో రూ.12 కోట్ల విలువైన మొలాసిస్‌తోపాటు, రూ.5 కోట్ల విలువైన పంచదార నిల్వలు ఉన్నాయన్నారు. ఈ రెండింటిని విక్రయిస్తే.. చెరకు రైతులు, కార్మికుల బకాయిలు చెల్లించడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ ఏడాది క్రషింగ్ సీజన్‌కు అవసరమైన ఓవర్‌హాలింగ్ పనులకు ప్రభుత్వం నుంచి నిధులు విడుదలయ్యేలా ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన చెరకు మద్దతు ధర రూ.3,151లకు అదనంగా రాష్ట్రప్రభుత్వం టన్నుకు రూ.449 కలిపి టన్నుకు రూ.3,600 మద్దతు ధర రైతులకు ప్రోత్సాహకంగా మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం గోవాడకు ఆర్థిక సహకారం అందించి చెరకు రైతులను ఆదుకోవాలని ధర్మశ్రీ విజ్ఞప్తి చేశారు.

కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి


ధర్నా చేస్తున్న కార్మికులు

నర్సీపట్నం రూరల్, సెప్టెంబరు 30 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖలలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. సోమవారం పాత మునిసిపల్ కార్యాలయం వద్ద డిమాండ్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు అడిగర్ల రాజు మాట్లాడుతూ మునిసిపల్, వైద్యా వైద్య రంగాలలో, పరిశ్రమలలో రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు 70 శాతం వేతనాలు తక్కువగా ఉన్నాయని తెలిపారు. ఉద్యోగ భద్రత, ఉద్యోగ విరమణ సౌకర్యాలు లేవని అన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు లోవరాజు, అర్జమ్మ, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ అవసరం


విద్యార్థులతో మాట్లాడుతున్న శకుంతల

కృష్ణాదేవిపేట, సెప్టెంబరు 30: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రత్యేక అవసరాలు గల (దివ్యాంగ) విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సమగ్ర శిక్షా సహిత విద్య జిల్లా కో-ఆర్డినేటర్ బి.శకుంతల సూచించారు. సోమవారం ఏఎల్‌పురం జడ్పీ హైస్కూల్‌ను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బుద్ధిమాంద్యం, స్పెసిఫిక్ అభ్యాసన వైకల్యం, దృష్టి లోపం గల విద్యార్థులను పలు ప్రశ్నలు వేసి, సమాధానాలు రాబట్టారు. అలాగే ప్రత్యేక ఉపాధ్యాయుడు తమ్మిన మాణిక్యాన్ని ప్రశస్త యాప్‌లో ఎంతమంది డౌన్‌లోన్ చేసుకున్నారు?, ఎంతమంది విద్యార్థులకు స్కానింగ్ జరిగిందో ఆరా తీశారు. మండలంలో 120 మంది ఉపాధ్యాయులు ఈ యాప్‌ను డౌన్‌లో చేసుకోగా, ఏఎల్‌పురంలో 100 మంది విద్యార్థులను స్కానింగ్ చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లోచల రమేశ్, మాణిక్యం, టీవీ రమణ, రామ్‌కుమార్, రామరాజు, అచ్చుబాబు, దేముడు తదితరులు పాల్గొన్నారు.

దుర్వాసన భరించాల్సిందేనా!?

... 5వ పేజీ తరువాయి

జోనల్ కార్యాలయ ఆవరణలో ఖాళీగా ఉన్న స్థలంలో డంపింగ్ చేసి, ఇక్కడి నుంచి డంపర్ లారీల ద్వారా కాపులుప్పాడ పంపడం మొదలుపెట్టారు. అయితే ఎప్పటికప్పుడు పూర్తిస్థాయిలో చెత్తను తరలించకుండా కొంతమేర అక్కడే వుంచుతున్నారు. వర్షాలకు ఇది కుళ్లిపోయి తీవ్ర దుర్వాసన వస్తున్నది. ఈగల బెడద కూడా పెరిగింది. సుమారు పదేళ్ల నుంచి ఈ సమస్యకు అధికారులు ముగింపు పలకలేదు. అనకాపల్లిలో సేకరించిన చెత్తను సుమారు 65 కిలోమీటర్ల దూరంలో వున్న కాపులుప్పాడకు తరలించడానికి రవాణా ఖర్చులు తడిసిమోపెడు అవుతున్నాయి. కంపోస్టు యార్డును వేరే ప్రాంతానికి తరలించడంలో జరుగుతున్న జాప్యంపై జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడును 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా, శంకరం వద్ద వున్న ఖాళీ స్థలంలో చెత్తను డంప్ వేసి, వెంటనే పెద్ద వాహనాల్లో దూర ప్రాంతాలకు తరలించాలని భావించామని, కానీ ఇక్కడకు సమీపంలోనే కలెక్టరేట్ కాంప్లెక్స్ నిర్మించే యోచన వుండడంతో విరమించామన్నారు. బవులవాడ ప్రాంతంలో స్థలాన్ని పరిశీలించామని, కానీ పట్టణానికి చాలా దూరంగా వుందన్నారు. కంపోస్టు యార్డును తరలించేందుకు స్థలాలను పరిశీలిస్తున్నామని, అనువైన స్థలం లభించిన వెంటనే టాన్సిట్ డంపింగ్ యార్డును అక్కడకు మార్చి, ప్రస్తుతం మాదిరిగానే పెద్ద వాహనాల్లో లోడింగ్ చేసి కాపులుప్పాడకు తరలిస్తామని చెప్పారు.

చెరువు ఆక్రమణ!

... 5వ పేజీ తరువాయి

గురించి పట్టించుకోవడంలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. చెరువు గట్టును ఆక్రమించి ఇళ్లు నిర్మించుకున్న వారికి పంచాయతీ అధికారులు ఆస్తి పన్ను విధిస్తున్నారని, దీనిని ఆధారంగా చేసుకుని విద్యుత్ సిబ్బంది కరెంటు కనెక్షన్లు ఇస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. చెరువు గట్టు, గర్భం ఆక్రమణకు గురైతే భవిష్యత్తులో చెరువులో పూడికతీత పనులు చేపట్టడం సాధ్యం కాదని అంటున్నారు. తక్షణమే ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి తుమ్మపాల కొత్తచెరువులో ఆక్రమణలను తొలగించాలని కోరుతున్నారు.

ఆక్రమణలను గుర్తించి చర్యలు తీసుకుంటాం

- ఈశ్వరరావు, తుమ్మపాల పంచాయతీ ఈవో

కొత్త చెరువులో ఆక్రమణలను గుర్తించి చర్యలు తీసుకుంటాం. ఎంత మేర ఆక్రమణకు గురైందో రెవెన్యూ అధికారులతో సర్వే చేయిస్తాం. ఆక్రమణదారులకు నోటీసులు ఇవ్వడంతోపాటు చట్టపరంగా చర్యలు తీసుకుంటాం.

కౌన్సిల్ సమావేశంలో ఇసుక దుమారం

... 5వ పేజీ తరువాయి

నిర్మూలనకు పబ్లిక్ టాయిలెట్స్ అవసరమని అన్నారు. దీనిపై ఆ ప్రాంత ప్రజలతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామని అన్నారు. మెయిన్ రోడ్డులో ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగించాలని వైస్‌చైర్మన్ తమరాన అప్పలనాయుడు కోరారు. టీడీపీ కౌన్సిలర్ మధుబాబు మాట్లాడుతూ, దనిమిరెడ్డి వీధిలో ఐస్ ప్లాంట్ మిషనరీ, వాటర్ ట్యాంక్‌ను డ్రైనేజీ కాలువ మీద నిర్మించారని, వాటిని కూడా తొలగించాలని అన్నారు. వైసీపీ కౌన్సిలర్ మాకిరెడ్డి బుల్లిదొర మాట్లాడుతూ, స్కేటింగ్ రింక్ ప్రాంగణంలో బాక్సింగ్ రింగ్, ఇండోర్ హాల్ నిర్మాణ పనులు రద్దు చేసినట్టు స్పోర్ట్స్ అథారిటీ నుంచి సమాచారం ఏమైనా ఉందా అని అడిగారు. టీడీపీ కౌన్సిలర్ శ్రీకాంత్ మాట్లాడుతూ, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అన్ని సౌకర్యాలతో క్రీడాకారుల కోసం ఇండోర్ స్టేడియం నిర్మాణానికి స్పీకర్ అయ్యన్నపాత్రుడు చర్యలు తీసుకున్నారని తెలిపారు.

ఉత్సవ విగ్రహాలుగా ఎంపీటీసీలు

... 5వ పేజీ తరువాయి

చూస్తే.. ఎంపీటీసీ సభ్యులుగా ఎందుకు గెలిచామో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా వైసీపీ స్థానంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం స్థానిక సంస్థలకు ప్రాధాన్యం ఇస్తున్న నేపథ్యంలో తమ గౌరవ వేతనాల బకాయిలకు నిధులు విడుదల చేస్తుందని ఎంపీటీసీ సభ్యులు ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు.

రావికమతం సబ్‌స్టేషన్‌లో అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం


అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించిన ఎస్‌ఈ ప్రసాద్

రావికమతం, సెప్టెంబరు 30: స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్‌లో సోమవారం రాత్రి ఐదు వేల కిలోవాట్ల సామర్థ్యం గల అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఈపీడీసీఎల్ ఎస్‌ఈ జి.ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సబ్ స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో రోజురోజుకు విద్యుత్ డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశామన్నారు. ఇకపై సబ్‌స్టేషన్ పరిధిలో లోవోల్టేజి సమస్య ఉండదన్నారు. వాణిజ్యం, పరిశ్రమలు, గృహాలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నర్సీపట్నం డివిజన్ ఆపరేషన్ ఈఈ వీడీవీ రామకృష్ణారావు, అనకాపల్లి డివిజన్ ఎంఆర్‌టీ ఈఈ రాజ్ కుమార్, వడ్డాది సబ్ డివిజన్ అపరేషన్ డీఈఈ అప్పలనాయుడు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో విజయానికి కష్టపడి పనిచేయాలి

- టీడీపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి బండారు అప్పలనాయుడు


శిక్షణలో మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండారు అప్పలనాయుడు

కె.కోటపాడు, సెప్టెంబరు 30: వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం కోసం అందరూ కష్టపడి పనిచేయాలని టీడీపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి బండారు అప్పలనాయుడు అన్నారు. సోమవారం కింతాడ శివారు కూండ్రపువానిపాలెంలో కె.కోటపాడు, దేవరాపల్లి మండలాల టీడీపీ సభ్యత్వ నమోదు శిక్షణలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాడుగులలో కేవలం 20 రోజుల్లో 28 వేల భారీ మెజార్టీతో బండారు సత్యనారాయణమూర్తి ఎమ్మెల్యేగా గెలిచారంటే అది కార్యకర్తల కష్టమేనన్నారు. వచ్చే ఎన్నికల్లో సర్పంచ్, ఎంపీటీసీ, ఎంపీపీ, జడ్పీటీసీలుగా విజయం సాధించాలని అప్పలనాయుడు పిలుపునిచ్చారు. టీడీపీ నాయకుడు పైలా ప్రసాదరావు మాట్లాడుతూ నియోజకవర్గంలో బహు నాయకత్వం పార్టీకి నష్టమేనని, ఏక నాయకత్వమే మేలు అని అభిప్రాయపడ్డారు. మన నాయకుడు ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అని, ఆయనకున్న అనుభవంతో నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసుకుందామన్నారు. ఈ సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు రొంగలి మహేష్, క్లస్టర్ ఇన్‌చార్జి కన్నూరు సూర్యనారాయణ, నాయకులు బత్తి వెంకటరమణ, కిలపర్తి భాస్కరరావు, సబ్బవరపు రామునాయుడు, లెక్కల మల్లేశ్వరరావు, పూడి నారాయణమూర్తి, కన్నూరు నాగభూషణం, జూరెడ్డి రాము, చల్ల నానాజీ తదితరులు పాల్గొన్నారు.

మూఢ నమ్మకాలపై విద్యార్థులకు అవగాహన


ఏఎల్‌పురంలో హైస్కూల్‌లో విద్యార్థి చేతి మీద వెలుగిస్తున్న హారతి

కృష్ణాదేవిపేట, సెప్టెంబరు 30 : మూఢ నమ్మకాలతో విద్యార్థులు, ప్రజలు భయాందోళన చెందవలసిన అవసరం లేదని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.త్రిమూర్తులరెడ్డి, మెజీషియన్ శ్రీరాములు (రాజమండ్రి) అన్నారు. సోమవారం ఏఎల్‌పురం జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులు, తల్లిదండ్రులకు మూఢనమ్మకాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మెజీషియన్ శ్రీరాములు మూఢనమ్మకాలపై పలు రకాల మ్యాజిక్కు చేసి, అవగాహన కల్పించారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు త్రిమూర్తులరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చిన్న వయస్సు నుంచే ప్రశ్నించే తత్వాన్ని అలవరుచుకుంటే విజ్ఞానం వస్తుందన్నారు. ప్రతి సంఘటన గుడ్డిగా నమ్మకూడదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గజ్జలపు మణికుమారి, సర్పంచ్ లోచల సుజాత, ఎంపీటీసీ సభ్యుడు చింతల బుల్లిప్రసాద్, పేరెంట్ కమిటీ చైర్మన్ లగుడు రాజులునాయుడు, ఉపాధ్యాయులు, జనవిజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు జోగినాయుడు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి వ్యాసరచన పోటీల్లో ప్రశాంతికి ప్రథమ స్థానం


కలెక్టర్ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న ప్రశాంతి, మౌనిక, యజ్ఞదీప్

నాతవరం, సెప్టెంబరు 30 : జిల్లా స్థాయి వ్యాసరచన పోటీల్లో గునుపూడి హైస్కూల్ విద్యార్థిని గానుగుల ప్రశాంతి ప్రథమ స్థానం సాధించింది. సోమవారం కలెక్టర్ చేతుల మీదుగా ఆమె ప్రశంసపత్రం అందుకుంది. స్వర్ణాంధ్ర-2027లో భాగంగా ' రాబోయే ఐదేళ్లలో విద్యారంగంలో తీసుకోవలసిన సంస్కరణలు'పై వ్యాసరచన పోటీలు నిర్వహించగా.. ప్రశాంతికి ప్రథమ స్థానం వచ్చింది. ప్రశాంతిని హైస్కూల్ హెచ్‌ఎం శివజ్యోతి, ఉపాధ్యాయులు ఎస్.సత్యారావు, స్కూల్ చైర్మన్ ఎన్.సత్యవతి, సీఆర్‌పీ పి.నాగేశ్వరరావు అభినందించారు.

నలంద విద్యార్థినికి ద్వితీయ స్థానం

నర్సీపట్నం: ప్రభుత్వం నిర్వహించిన స్వర్ణాంధ్ర-2047 జిల్లా స్థాయి డిబేట్ పోటీలలో స్థానిక నలంద విద్యార్థి పి.మౌనిక ద్వితీయ స్థానంలో నిలిచింది. సోమవారం జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని, జ్ఞాపికను అందజేశారు. కరస్పాండెంట్ ఎన్‌వీ రాజేశ్, డైరెక్టర్ నేరెళ్ల సీత చంద్రిక, ప్రిన్సిపాల్ ఎంఎన్ నాయుడు, ఉపాధ్యాయులు అభినందించారు.

శ్రీచైతన్య విద్యార్థికి ద్వితీయ స్థానం

స్వర్ణాంధ్ర-2047 జిల్లా స్థాయి వక్తృత్వ పోటీలో నర్సీపట్నం శ్రీచైతన్య బ్రాంచ్ విద్యార్థి కె. యజ్ఞదీప్ ద్వితీయ స్థానం సాధించారు. సోమవారం కలెక్టర్ విజయకృష్ణన్ విద్యార్థికి ప్రశంసా పత్రం, జ్ఞాపిక అందజేశారు. శ్రీచైతన్య పాఠశాలల ఉత్తరాంధ్ర ఎగ్జిక్యూటివ్ ఏజీఎం ఎంవీ సురేష్, రీజనల్ ఇన్‌చార్జి ఎం. రమణ, ఎగ్జిక్యూటివ్ కో-ఆర్డినేటర్ పట్నాయక్, ప్రిన్సిపాల్ శ్రీను, డీన్ నాగేశ్వరరావు విద్యార్థిని అభినందించారు.

గర్భిణులు పౌష్టికాహారాన్ని తీసుకోవాలి

- ఐసీడీఎస్ పీవో శ్రీగౌరి
- ముగిసిన పోషణ్ మాసోత్సవాలు


చీడిగుమ్మల అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సీమంతాలు

గొలుగొండ, సెప్టెంబరు 30: గర్భిణులు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇస్తున్న పౌష్టికాహారాన్ని తీసుకోవాలని స్థానిక ఐసీడీఎస్ పీవో శ్రీగౌరి అన్నారు. సోమవారం మండలంలోని చీడిగుమ్మల అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పౌష్టికాహారం తీసుకుంటే పుట్టబోయే బిడ్డ సంపూర్ణ ఆరోగ్యంతో జన్మిస్తారన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు భీమిరెడ్డి సత్యనారాయణ, సర్పంచ్ కాపారపు చిన్నబ్బాయి, నాయకులు భీమిరెడ్డి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణాదేవిపేటలో..

గొలుగొండ మండలం ఏఎల్‌పురం అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ మాసోత్సవాలు ముగింపు సందర్భంగా సోమవారం గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. ఎంపీపీ గజ్జలపు మణికుమారి, సర్పంచ్ లోచల సుజాత గర్భిణులకు సీమంతాలు జరిపారు. ఈ కార్యక్రమంలో పేరెంట్ కమిటీ చైర్మన్ రాజులునాయుడు, సెక్టార్ సూపర్‌వైజర్ ఎం.సత్యశ్రీ, అంగన్‌వాడీ కార్యకర్తలు మంగ, భవానీ, ధనలక్ష్మి, రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

కె.కోటపాడులో..

మండలంలోని రామచంద్రపురం అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ మాసోత్సవాలు ముగింపు కార్యక్రమం సోమవారం నిర్వహించారు. నెల రోజులు పాటు నిర్వహించిన పలు కార్యక్రమాలు గురించి వివరించారు. గర్భిణులకు సామూహిక సీమంతాలు, పిల్లలకు అన్న ప్రసాదం మొదలగు కార్యక్రమాలు నిర్వహించినట్టు సూపర్‌వైజర్ మంగతాయారు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు సుశీల, కల్యాణి, ఆదిలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మాకవరపాలెంలో..

మండలంలోని రాచపల్లి శివారు ఎరకన్నపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పోషణ్ మాసోత్సవాలు ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు సామగ్రిని సీనియర్ నాయకుడు రుత్తల జోగిపాత్రుడు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది వెంకటలక్ష్మి, కె.దివ్య, పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


నాతవరంలో..

గుమ్మిడిగొండ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ మాసోత్సవాలు ముగింపు సందర్భంగా గర్భిణులకు సీమంతాలు చేశారు. కిశోర బాలికలకు రంగవల్లుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సూర్యప్రభ మాట్లాడుతూ.. నాతవరం మండలంలో 9 మోడల్ అంగన్‌వాడీ కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఎ.నాగజ్యోతి, మాజీ సర్పంచ్ శెట్టి నూకరాజు, సుర్ల అచ్చియ్యనాయుడు, మణికంఠ పాల్గొన్నారు.

రోలుగుంటలో..

రోలుగుంట అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ మాసోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హైమావతి మాట్లాడుతూ.. పౌష్టికాహారంతో ఆరోగ్యవంతమైన జీవితం ఉంటుందని, గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ వరలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్‌లో పలువురు విద్యార్థుల ప్రతిభ



స్కూల్‌గేమ్స్‌కు ఎంపికైన గాంధీగ్రామం ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులతో ఉపాధ్యాయులు

చోడవరం, సెప్టెంబరు 30: నియోజకవర్గ స్కూల్‌గేమ్స్ పోటీలలో స్థానిక గాంధీగ్రామం ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులు సత్తా చాటి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. చెస్‌లో రిత్విక్, బ్యాడ్మింటన్‌లో సాయిరాం, షణ్ముఖ్, వాలీబాల్‌లో అరుణ్‌కుమార్, ఇస్సాక్, ఖోఖోలో చరణ్, ధరణీకాంత్, వినయ్ యశ్వంత్, యోగాలో ధనుష్, రవితేజ, గౌతమ్ కుమార్ జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించారని హైస్కూల్ హెచ్‌ఎం పాండురంగారావు తెలిపారు. అథ్లెటిక్స్ విభాగంలో వంద మీటర్ల పరుగులో అరుణ్‌కుమార్, నవీన్‌రాజ్, వినయ్, 600 మీటర్ల పరుగులో చరణ్, 800 మీటర్ల పరుగులో సంపత్, 1500 మీటర్ల పరుగులో సంపత్‌కుమార్, లాంగ్‌జంప్‌లో చరణ్, దుర్గాప్రసాద్, హైజంప్‌లో అరుణ్‌కుమార్ విజయాలు సాధించి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. విజేతలను హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

కృష్ణాదేవిపేటలో.. గొలుగొండ మండలం చోద్యం జడ్పీ హైస్కూల్ నుంచి జిల్లా స్థాయి స్కూల్ గ్రేమ్స్ పోటీలకు 22 మంది విద్యార్థులు ఎంపికైనట్టు హెచ్‌ఎం. పి.శ్రీనివాసరావు, వ్యాయామ టీచర్ కుందూరు నూకరాజు తెలిపారు. విద్యార్థులను హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు రమణ, ప్రసాదు, వాసు అభినందించారు.

చీడికాడలో.. మండలంలో వరహాపురం హైస్కూల్‌కి చెందిన పలువురు విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జిల్లా స్థాయి పోటీలకు ధర్మిశెట్టి వసంత, కరణం జ్యోతి, జి.వసంత, వి.కృష్ణవేణి, డి.లోవవర్ధన్, ఎస్.నీలవర్ధన్, చూమాదురి, ఎ.జయంతి, ఎస్.లక్ష్మీనారాయణ, పలువురు విద్యార్థులు ఎంపికయ్యారు. విజేతలను హెచ్‌ఎం డి.వరహామూర్తి, పీడీ ఆర్.సింహాచలం పాల్గొన్నారు.

మాడుగుల రూరల్‌లో.. కింతలి జడ్పీ హైస్కూల్లో ఇటీవల నిర్వహించిన స్కూల్ ఫెడరేషన్ గేమ్స్‌లో వమ్మలి జడ్పీ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. అండర్-17, అండర్-14 బాలురు, బాలికల విభాగాల్లో ఖోఖో పోటీల్లో ప్రథమ స్థానాలు, అండర్-17, అండర్-14 బాలుర, బాలికల కబడ్డీ పోటీల్లో రెండవ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. అలాగే నియోజకవర్గ స్థాయిలో అండర్-17 ఖోఖో పోటీల్లో మొదటి స్థానాన్ని సాధించారు. జిల్లాస్థాయి పోటీలకు 15 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. విద్యార్థులను హెచ్‌ఎం జగన్మోహన్‌నాయుడు, టీచర్లు అభినందించారు.

రావికమతంలో.. స్థానిక జడ్పీ హైస్కూల్‌లో నియోజకవర్గ స్థాయి బాలికల ఆటల పోటీలు సోమవారం ముగిశాయి. ఇక్కడ జరిగిన పోటీల్లో రావికమతం, రోలుగుంట, బుచ్చెయ్యపేట, చోడవరం మండలాలకు చెందిన 250 మంది క్రీడాకారిణులు పాల్గొన్నారు. ఇక్కడ జరిగిన కబడ్డీ, ఖోఖో, బాల్ బ్యాడ్మింటన్, వాలీబాల్, చదరంగం పోటీల్లో 120 మంది క్రీడాకారిణిలను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశామని స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ బి.కన్నంనాయుడు తెలిపారు. హెచ్‌ఎం మల్లికార్జునరావు, పీడీ లక్ష్మణరావులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

దేవరాపల్లిలో.. మండలంలోని తెనుగుపూడి గురుకుల విద్యార్థులు స్కూల్ గేమ్స్ ఆటల పోటీలలో సత్తా చాటారు. ఈనెల 27, 28 తేదీలలో చౌడువాడలో జరిగిన పోటీల్లో అండర్-17 విభాగంలో ఖోఖో, వాలీబాల్, యోగా, చెస్‌ల్లో ప్రథమ స్థానంలో నిలిచారు. అండర్-14 విభాగంలో ఖోఖో, వాలీబాల్, యోగా, చదరంగం, ప్రథమ స్థానం సంపాదించారు. 100 మీటర్లు, 200 మీటర్లు పరుగు పందెంలో పదో తరగతి విద్యార్థి ఎస్.గౌరీ మణిశంకరు ప్రథమ స్థానంలో నిలిచారు. లాంగ్ జంప్‌లో ఎన్.సాయి ప్రథమ స్థానంలో నిలిచాడు. విద్యార్థులను జిల్లా కో-ఆర్డినేటర్ ఎస్.రూపవతి, పీఈటీ తరుణేశ్వరరావు, ప్రిన్సిపాల్ జయప్రకాష్, రఘు అభినందించారు.

ఉపాధి హామీ ఏపీవోగా సూర్యమణి

గొలుగొండ, సెప్టెంబరు 30: మండలంలోని ఉపాధి హామీ పథకం ఏపీవోగా సూర్యమణి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇన్‌చార్జి ఏపీవో రాధిక నుంచి ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఈమె రోలుగుంట మండలంల నుంచి బదిలీపై వచ్చారు.

ఇసుక ట్రాక్టర్‌పై కేసు

గొలుగొండ, సెప్టెంబరు 30: ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్‌పై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ రామారావు తెలిపారు. మండలంలోని పాతమల్లంపేటలో ధారగెడ్డ వద్ద ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్టు స్థానికులు అందించిన సమాచారం మేరకు ట్రాక్టర్‌ను పట్టుకొని, కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

భౌతిక శాస్త్ర అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

కె.కోటపాడు, సెప్టెంబరు 30: స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజిలో భౌతికశాస్త్రంలో అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కాలేజి ప్రిన్సిపాల్ ఎస్.నాగమణి తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టు చదివి ఉండి పీజీలో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హత ఉన్న వారు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో యాజమాన్యాన్ని సంప్రదించాలన్నారు.

ఘనంగా అంతర్జాతీయ అనువాద దినోత్సవం

మాకవరపాలెం, సెప్టెంబరు 30: మండలంలో తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాల్లో అంతర్జాతీయ అనువాద దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు కోసూరు రాము మాట్లాడుతూ అన్ని భాషల్లో ఉన్న సాహిత్యం, సైన్స్ అండ్ టెక్నాలజీ అంశాలు, చరిత్ర ప్రపంచంలో ఉన్న ప్రజలందరికీ తెలియాలన్నారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'సంపద తయారీకి వానపాములు అవసరం'

చీడికాడ, సెప్టెంబరు 30: చెత్త నుంచి సంపద తయారీకి వానపాములు అవసరమని స్థానిక సర్పంచ్ కోడూరు సత్యవతి అన్నారు. మండలంలో జైతవరంలో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో నాలుగు తొట్టెల్లో పది కిలోల వానపాములను స్థానిక ఎంపీటీసీ సభ్యుడు పైల ముత్యాలనాయుడు, గ్రామస్థాయి అధికారులతో కలిసి విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పట్నాల గోపి, కొల్లి నవీన్, వీఆర్‌వో కోడూరు గౌరీశంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన రాముడికి నగదు ప్రోత్సాహకం

దేవరాపల్లి, సెప్టెంబరు 30: మండలంలోని కాశీపురం జడ్పీ హైస్కూల్‌కు చెందిన రెడ్డి రాముడు రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల జరిగిన జిల్లా స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో రాముడు తృతీయ స్థానం సాధించాడు. ఈ సందర్భంగా సోమవారం జరిగిన కార్యక్రమంలో బ్యాడ్మింటన్ క్రీడాకారుడు రాముడుకు గ్రామానికి చెందిన ఆదిరెడ్డి పరదేశినాయుడు నగదు బహుమతిని అందజేశారు. పేరెంట్స్ కమిటీ అధ్యక్షురాలు ఆదిరెడ్డి వరలక్ష్మి, హెచ్‌ఎం బీటీ.సుందరి, కొటాన రాంబాబు, నరసింగరావు పాల్గొన్నారు.

వైభవంగా వినాయక అనుపోత్సవం

మాడుగుల, సెప్టెంబరు 30: మాడుగులలో సోమవారం వినాయక అనుపోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. వినాయక చవితికి గ్రామంలో అత్యధిక శాతం విగ్రహాలను ఏర్పాటుచేశారు. సోమవారంతో వినాయక అనుపోత్సవాలు ముగిశాయి. ఈ అనుపోత్సవాల్లో ట్రాక్టర్లపై వినాయకులను ఎక్కించి వివిధ రకాల సెట్టింగ్‌లతో పురవీధుల గుండా ఊరేగించారు. అనంతరం సమీప నదీ, చెరువులలో నిమగ్నం చేశారు.

లౌలీ బోయిస్ ఆధ్వర్యంలో..

దేవరాపల్లి, సెప్టెంబరు 30: మండల కేంద్రంలో లౌలీ బోయిస్ ఆధ్వర్యంలో వినాయక సంబరాలు అంగరంగ వైభవంగా జరిగాయి. బండ్ల వేషాలు, కర్రసాము, జానపద నృత్య గీతాలు, మోనో డ్యాన్స్‌లు, కోలాటం తదితర సాంస్కృతిక కార్యక్రమాలతో ఊరేగింపు నిర్వహించారు. బాణసంచా పేల్చారు. గణపతిని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కేశినేని సురేంద్ర, టీడీపీ నాయకుడు పైలా ప్రసాదరావు, మాజీఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, జనసేన నాయకుడు గొర్రుపోటు రామ్మూర్తినాయుడు, ఎంపీటీసీ సభ్యుడు మొల్లి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

'విద్యార్థులు అన్నింటా రాణించాలి'

కె.కోటపాడు, సెప్టెంబరు 30: విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని, సేవా దృక్పథాన్ని అలవాటు చేసుకోవాలని సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు కశిరెడ్డి అప్పలనాయుడు అన్నారు. సోమవారం స్థానిక అయ్యన్న విద్యాసంస్థల విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పలనాయుడు మాట్లాడుతూ వ్యాసరచన పోటీలతో విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకత వెలుగు చూస్తుందన్నారు. అయ్యన్న విద్యా సంస్థల అధినేత డాక్టర్ ఖాశీం మాట్లాడుతూ వ్యాసరచన పోటీలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సేవా సహ సమన్వయకర్త కన్నూరు అప్పలనాయుడు, కె. కోటపాడు సమితి కన్వీనర్ బండారు నారాయణపాత్రుడు, సేవాదళ్ కన్నూరు చెల్లిబాబు, జేగురుపాటి భీమేశ్వరరావు, నక్కెళ్ల మల్లేశ్వరరావు, బండారు కన్నబాబు, యడ్ల అప్పలనాయుడు, గజ్జి అప్పలనాయుడు, రావాడ వెంకటరమణ, కశిరెడ్డి చందు, ప్రసన్న, యామిని పాల్గొన్నారు.

డిగ్రీ కాలేజీ విద్యార్థుల స్వచ్ఛత ర్యాలీ

చోడవరం, సెప్టెంబరు 30: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీ విద్యార్థులు సోమవారం స్వచ్ఛతా హీ ర్యాలీని నిర్వహించారు. ప్లాస్టిక్ వినియోగించవద్దని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని కోరుతూ కాలేజీ విద్యార్థులు పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్, ఎన్‌ఎస్‌ఎస్ పీవోలు రత్నభారతి, మాల్యాద్రి, పిచ్చమ్మ, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

దసరాకు ప్రత్యేక బస్సులు

... 5వ పేజీ తరువాయి

అనకాపల్లి కాంప్లెక్స్‌కు వచ్చేలా చర్యలు చేపడతామని ఆయన చెప్పారు.

పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సమయంలో అనకాపల్లి నుంచి పలు ప్రాంతాల్లోని పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్టు ఏడీఎం రవిచంద్ర తెలిపారు. అనకాపల్లి నుంచి విజయవాడ వెళ్లి తిరిగి అనకాపల్లి చేరుకునేందుకు ఒక్కో ప్రయాణికుడి నుంచి రూ.900లు చార్జీ వసూలు చేస్తామన్నారు. అలాగే అనకాపల్లి నుంచి విజయవాడ, ద్వారకాతిరుమల, తిరిగి అనకాపల్లికి రూ.950లు, అనకాపల్లి నుంచి విజయవాడ, ద్వారకాతిరుమల, ద్వారపూడి మీదుగా తిరిగి అనకాపల్లికి రూ.1,000, అనకాపల్లి నుంచి భద్రాచలం, విజయవాడ, ద్వారకాతిరుమల మీదుగా తిరిగి అనకాపల్లికి రూ.1,220లు, అనకాపల్లి నుంచి భద్రాచలం, పర్ణశాల, విజయవాడ, ద్వారకాతిరుమల, ద్వారపూడి మీదుగా తిరిగి అనకాపల్లికి రూ.1,300 చార్జీ వసూలు చేస్తామన్నారు. పల్లెవెలుగు బస్సులకు మాత్రమే ఈ చార్జీలు వర్తిస్తాయన్నారు.